# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :252 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 13-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## 57 గంటలపాటు శ్రమించినా దక్కని ఫలితం..

జైపూర్: రాజస్థాన్‌లోని (రాజస్థాన్) దౌసాలో విషాదం చోటుచేసుకున్నది. బోరుబావిలో పడిన ఐదేండ్లు బాలుడిని రెస్క్యూ సిబ్బంది రక్షించడంతో అతడు మరణించాడు. దీంతో 57 గంటలపాటు సాగిన రెస్క్యూ ఆపరేషన్ విషాదంతమైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో దౌసా నిర్వహించిన కలిఖడ్ గ్రామంలో ఆర్యన్ అనే ఐదేండ్ల బాలుడు.. ఇంటి పక్కనే ఉన్న 175 అడుగుల లోతున్న బోరుబావిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం అందించారు. దీనితో ఘటనా స్థలానికి చేరుకోవడానికి సహాయకచర్యలు.ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అల్యూమినియంతో తయారు చేసిన హుక్ ద్వారా బాలుడిని బయటకు తీయడానికి విఫలయత్నం చేశారు. అది ఫలించ బోరుబావికి కొంత దూరంలో 4 అడుగుల వెడల్పుతో గుంత తీశారు. 150 అగుడుల మేర తవ్వకం పూర్తయిన తర్వాత అందులోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది.. సొరంగం తవ్వి బాలుడిని కాపాడారు. అప్పటికే అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీనితో గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసి అంబులెన్సులో దవాఖానకు ఏర్పాటు చేశారు. అయితే అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

# ఢిల్లీకి చేరిన తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం..సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది.అయితే..కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

# వైసీపీకి మరో షాక్.. పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ గుడ్‌బై..

విశాఖపట్నం :వైఎస్ జగన్‌కు మరో భారీ షాక్ తగిలింది.. వైసీపీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ గుడ్‌బై చెప్పేశారు.. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాజీనామా లేఖ రాశారు అవంతి శ్రీనివాస్..కొంత కాలంగా పార్టీతో అంటీముట్టనట్టుగా ఉంటున్నారు అవంతి శ్రీనివాస్.. 2019 ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రి అయిన అవంతి శ్రీనివాస్.. వైసీపీ హయంలో పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు.. ఇక, తాజా ఎన్నికల్లో ఆయన ఓటమిపాలయ్యారు.. అయితే, అవంతి పార్టీ వీడుతున్నారంటూ చాలా కాలంగా ప్రచారం సాగుతోంది.. చివరకు పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమై.. పార్టీ అధ్యక్షుడికి రాజీనామా లేఖను పంపించారు..అయితే, "నా వ్యక్తిగత కారణాలతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకోవడం వలన భీమిలి నియోజకవర్గం ఇంఛార్జ్ బాధ్యతలను మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను.. మీరు ఇచ్చిన అవకాశానికి నా ధన్యవాదములు.. నీ రాజీనామాను ఆమోదించ వలసిందిగా కోరుతున్నాను" అంటూ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అలియాస్ అవంతి శ్రీనివాస్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు..ఈ సందర్భంగా మీడియాతో అవంతి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్ పై విమర్శలు గుప్పించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వానికి కనీసం ఒక ఏడాది సమయం ఇవ్వాలని చెప్పారు. ఐదు నెలల సమయం కూడా ఇవ్వకుండానే ధర్నాలు చేయాలంటే ఎలాగని ప్రశ్నించారు.ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ గౌరవించాలని అవంతి అన్నారు. ఐదేళ్లు పాలించాలని కూటమికి ప్రజలు అవకాశం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఎన్నో పథకాలను అమలు చేసి కూడా ఎన్నికల్లో ఓడిపోయామంటే తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలని చెప్పారు. పార్టీ అనేది ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని అన్నారు. వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తలంతా నలిగిపోయారని చెప్పారు. తాడేపల్లిలో కూర్చొని జగన్ ఆదేశాలు ఇస్తుంటారని%% క్షేత్రస్థాయిలో



ఇబ్బంది పడేది కార్యకర్తలని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీలో కార్యకర్తలకు గౌరవం లేదని విమర్శించారు.చిరంజీవిపై ఉన్న అభిమానంతో తాను రాజకీయాల్లోకి వచ్చానని, నిజయతీగా ప్రజలకు సేవ చేశానని తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్లే తాను వైసీపీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. తన కుటుంబానికి సమయం ఇవ్వాలనుకుంటున్నానని, తమ విద్యాసంస్థలను కూడా చూసుకోవాల్సి ఉందని తెలిపారు.ఇక, అవంతి శ్రీనివాస్ 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు.. అయితే, 2014 ఎన్నికలలో టీడీపీ గూటికి చేరి అనకాపల్లి నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఇక, 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన అవంతి శ్రీనివాస్.. భీమిలి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.. వైఎస్ జగన్ కేబినెట్ 1లో పర్యావరణ, అటవీశాఖ మంత్రిగా పనిచేశారు.. కానీ, జగన్ కేబినెట్ 2లో ఆయన్ని పక్కన బెట్టారు.. ఆ సమయంలో పలు వివాదాల్లో కూడా అవంతి పేరు వినిపించింది.. ఇక, తాజాగా జరిగిన ఎన్నికలలో అవంతి శ్రీనివాస్ భీమిలిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు.. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతిలో ఏకంగా 92,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

# గురుగ్రామ్‌లో బాంబు పేలుడు మా పనే: బిష్ణోయ్ గ్యాంగ్



గురుగ్రామ్: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు ఇటీవల కాలంలో దేశంలో మారుమోగిపోతోంది. ఈ సమయంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల హరియాణా లోని గురుగ్రామ్‌లో చోటుచేసుకున్న నాటుబాంబు పేలుడుకు తామే కారణమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది. గురుగ్రామ్ సెక్టార్ 29లోని ఓ బార్ వెలుపల మంగళవారం బాంబు పేలుడు సంభవించింది. ఈ దాడికి సంబంధించి సచిన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి మరో రెండు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఆ దాడి తామే చేశామని బిష్ణోయ్ అనుచరులు రోహిత్ గదర్, గోల్డీ బ్రార్‌లు సామాజిక మాధ్యమం వేదికగా ఓ పోస్ట్ చేశారు. అందులో బార్ యజమాని అక్రమ మార్గాల్లో రూ.కోట్లు సంపాదిస్తున్నారని, పన్నులు ఎగ్గొట్టి దేశానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈసందర్భంగా అందరూ పన్నులు చెల్లించాల్సిందేనని హెచ్చరించారు. మరోవైపు ఇది చిన్న పేలుడే అని తేలిగ్గా తీసుకోవద్దని, భారీ పేలుళ్లు చేయగల సామర్థ్యం తమకు ఉందంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులు ఈ పోస్ట్‌పై దర్యాప్తు చేస్తున్నారు. ఇక, ఈ ఏడాది ఏప్రిల్ 14న సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద కాల్పుల ఘటన చోటుచేసుకుంది. దానికి బాధ్యత వహిస్తూ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు. ఆ కేసు విచారణలో భాగంగా ముంబయి పోలీసులు అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అలాగే 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ కేసులోను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అతడిపై సుమారు 18 కేసులు ఉన్నాయి. మరోవైపు ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీని హత్య చేసింది కూడా తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వెల్లడించింది.అతడికి అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో సంబంధాలు ఉండటం వల్లే హత్య చేసినట్లుగా పేర్కొంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉంటున్నాడు. బ్యారక్‌ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈవిధంగానే చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. భాను పేరుతో చెలామణి అవుతున్న అన్మోల్.. నకిలీ పాస్‌పోర్టును ఉపయోగించి దేశం విడిచిపారిపోయాడు. ఈ కేసుల విచారణలో భాగంగా అన్మోల్ గురించి సమాచారం ఇచ్చినవారికి రూ.10 లక్షల రివార్డు ఇస్తామని ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) ప్రకటించింది. ఈ క్రమంలోనే అతడు అమెరికాలో అరెస్టైనట్లు వార్తలు వచ్చాయి.

## సింగరేణి ఆర్థికసాయం .. సివిల్స్ మెయిన్స్ కు 20 మంది ఎంపిక

యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది తొలిసారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది.

# మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు..

హైదరాబాద్,టీవీ9 ప్రతినిధి రంజిత్‌పై దాడి చేసిన మోహన్‌బాబుకు ఊహించని షాకిచ్చారు పోలీసులు. బుధవారం కేవలం 118 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈరోజు ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేశారు. జర్నలిస్టు సంఘాల ఆందోళనలతో లీగల్ ఒపీనియన్ తీసుకుని సెక్షన్ ను మార్చిన రాచకొండ పోలీసులు.. మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. జర్నలిస్ట్ రంజితపై దాడి ఘటనలో BNS 109 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హైదరాబాద్ జల్ పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. తన పాప ఇంట్లో ఉందని%% తన భార్యతో కలిసి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు మంచు మనోజ్. దీంతో అతడిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో సెక్యూరిటీతో వాగ్వాదానికి దిగిన మనోజ్ గేట్లు తోసుకుని మరీ ఇంట్లోకి వెళ్లారు. అదే సమయంలో మోహన్ బాబు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఈ క్రమంలో కవరేజీ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులను మోహన్ బాబు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. టీవీ9 జర్నలిస్ట్ రంజిత్ చేతిలోని మైక్ తీసుకుని అతడిపై బలంగా దాడి చేశాడు. ఈ ఘటనలో టీవీ9 రిపోర్టర్ రంజిత్ తీవ్రంగా గాయపడ్డారు. అతడి కంటికి, చెవికి మధ్య మూడు లెవల్స్ లో ఫ్రాక్చర్ అయ్యిందని.. సెన్సిటివ్ జైగోమాటిక్ ఎముక విరగడంతో అతడికి బుధవారం సర్జరీ చేశారు వైద్యులు.రంజిత్ పై దాడి మోహన్ బాబు దాడి చేయడంపై జర్నలిస్ట్ లోకం భగ్గుమంది. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్ట్ సంఘాలు ధర్నాలతో హోరెత్తించాయి. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబు పై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు లీగల్ ఒపీనియన్ కు వెళ్లి సెక్షన్ మార్చి మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.



# కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు



హైదరాబాద్: విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్ధతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు. బీజేపీకి ఎమ్మెల్సీ చిత్తశుద్ధి ఉన్నా.. తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి: కవిత బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు.

## తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్: బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని చెప్పారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.విదేశాల్లో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం సహాయం. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని ప్రభుత్వం సాకుదని చూపిస్తున్నది. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు.

# కేబినెట్ కూర్పుపై షిండే మళ్లీ అలక..ఢిల్లీ టూర్‌కు దూరం!

ముంబై:మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం ఏర్పడినా.. రాజకీయ పరిస్థితుల మాత్రం ఇంకా సద్దుమణగలేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన 12 రోజులకు ప్రభుత్వం ఏర్పడింది.అప్పటి వరకు ముఖ్యమంత్రి పదవిపై మహాయుతి కూటమిలో తీవ్ర పంచాయితీ జరిగింది. చివరికి బీజేపీనే.. ఆ పీఠాన్ని దక్కించుకుంది. దేవేంద్ర ఫడ్నవిస్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. ఉపముఖ్య మంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రమాణం చేశారు. అయిష్టంగానే ఏక్‌నాథ్ షిండే డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేసినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఫడ్నవిస్ కేబినెట్ కూర్పు చేస్తున్నారు. ఇందుకు హైకమాండ్ పెద్దలను కలిసేందుకు బుధవారం హస్తినకు వెళ్లారు. బుధవారం సాయంత్రం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కర్‌ను కలిశారు. అమిత్ షాతో మంత్రివర్గంపై చర్చించారు. ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా ఢిల్లీలోనే మకాం వేశారు. శివసేన నేత షిండే మాత్రం హస్తినకు వెళ్లలేదు. ముంబైలోనే ఉన్నారు. అయితే శివసేన హోంమంత్రి పదవిని ఆశిస్తున్నట్లుగా సమాచారం. కానీ హోంశాఖను ఇచ్చేందుకు ఫడ్నవిస్ సుముఖంగా లేనట్లు కనిపిస్తోంది. హోంశాఖను తన దగ్గరే పెట్టుకోవాలని ఫడ్నవిస్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శివసేన గుర్రుగా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే మంత్రి పదవులపై బీజేపీ, ఎన్సీపీ ఒక క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. శివసేన విషయంలోనే ఇంకా పంచాయితీ తెగనట్లుగా కనిపిస్తోంది. బీజేపీకి 22, శివసేనకు 11, ఎన్సీపీకి 10 మంత్రి పదవులు కేటాయించినట్లు సమాచారం. మొత్తం మహారాష్ట్రలో గరిష్టంగా 43 మంది మంత్రులు ఉండే అవకాశం ఉంది. అయితే శివసేన కీలకమైన పోర్ట్‌పోలియోను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అవి ఇచ్చేందుకు మాత్రం ఫడ్నవిస్ నిరాకరిస్తున్నట్లు సమాచారం. దీంతోనే మహాయుతిలో మరోసారి తీవ్ర పంచాయితీ సాగుతోంది. హోంశాఖతో పాటు రెవెన్యూను తన దగ్గరే ఉంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. శివసేనకు అర్బన్ డెవలప్‌మెంట్ ఇవ్వాలని చూస్తున్నారు. ఇక ఎన్సీపీకి మాత్రం ఫైనాన్స్ కేటాయించే అవకాశం ఉంది.డిసెంబర్ 16 నుంచి మహారాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సమావేశాలకు రెండు రోజుల ముందే



మంత్రివర్గ విస్తరణ చేయాలని ఫడ్నవిస్ భావిస్తున్నారు. డిసెంబర్ 14నే ఈ కార్యక్రమం ముగించాలని అనుకుంటున్నారు. కానీ పోర్ట్‌పోలియోపై పంచాయితీ తెగకపోవడంతో ఇది మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.మహాయుతి భారీ విజయాన్ని నమోదు చేసింది. బీజేపీ 132, శివసేన 57, ఎన్సీపీ 41, కాంగ్రెస్ 16, ఉద్ధవ్ థాక్రే 20,శరద్ పవార్ పార్టీ 10 స్థానాలు గెలుచుకుంది.డిసెంబర్ 5న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీ కారం చేశారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు సరికొత్త సేవలతో ముందుకొస్తోంది. ప్రయాణికులు, కండక్టర్ల మధ్య తరచుగా ఏర్పడే చిల్లర సమస్యలను ఎదుర్కొనేందుకు ఆర్టీసీ ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కొత్త పరిష్కారాన్ని తీసుకురానుంది. బస్సుల్లో ఆన్లైన్ పేమెంట్ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే సంస్థ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.హైదరాబాద్ నగరంలో ఈ కొత్త ఆన్లైన్ పేమెంట్ సేవలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ప్రయాణికులు తమ బస్ టికెట్ ధరను డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించే అవకాశం పొందనున్నారు. QR కోడ్ స్కాన్ చేయడం ద్వారా లేదా ఇతర డిజిటల్ పేమెంట్ మార్గాల ద్వారా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## సంపాదకీయం

శుక్రవారం 13-12-2024

# అలవాటులో పొరపాటు

తలుపు తాళం వేసి వెళ్తాం. బస్సెక్కాక తాళం వేశామా లేదా అన్న అనుమానం మొదలవుతుంది. స్టౌ కట్టేశానా, గీజర్ ఆఫ్ చేశానా... నూటికి తొంభై తొమ్మిది మందికి ఇలాంటి అనుమానాలు సహజం. ఎందుకనీ అంటే... అలా నిత్యం చేసే పనుల్ని ఆలోచించకుండా, అనుభూతి చెందకుండా కేవలం అలవాటుకొద్దీ చేసేస్తాం.తలుపు తాళం వేసి వెళ్తాం. బస్సెక్కాక తాళం వేశామా లేదా అన్న అనుమానం మొదలవుతుంది. స్టౌ కట్టేశానా, గీజర్ ఆఫ్ చేశానా... నూటికి తొంభై తొమ్మిది మందికి ఇలాంటి అనుమానాలు సహజం. ఎందుకనీ అంటే... అలా నిత్యం చేసే పనుల్ని ఆలోచించకుండా, అనుభూతి చెందకుండా కేవలం అలవాటుకొద్దీ చేసేస్తాం. అంటే మన మెదడుకు తెలియకుండానే చేతులు ఆ పని చేసేస్తాయి. ఆలోచనను అనుభూతిని మనకు తెలియకుండానే మాయం చేసేసిందన్నమాట ఈ అలవాటు! అలవాటంటేనే క్రమం తప్పకుండా, అసంకల్పితంగా, మళ్లీ మళ్లీ చేసే పని. దేనికైనా ఒక్కసారి అలవాటుపడ్డామా ఇక మార్చుకోవడం కష్టం. అందుకే, 'మప్పడం తేలిక, తిప్పడం కష్టం' అన్నారు. నిజమే, అలవాటు మహా టక్కరి!ఆలోచన, అనుభూతి మనల్ని నడిపిస్తున్నాయనుకుంటాం కానీ, 'అలవాటు' అనే కనిపించని మూడో కోణం ఉంది! మూడొంతుల దినచర్యలో మనల్ని ఆడించేది అదే. అందుకే సమస్యలన్నీ అక్కడే మొదలవుతాయి. 'ఏదో అలవాటుకొద్దీ అనేశాను', 'సారీ, అలవాటులో పొరపాటయ్యింది', 'ఏంటో.. ఇలా అలవాటైపోయింది'... ఇలా సంజాయిషీలు ఇచ్చేటప్పుడు, మన్నింపులు కోరేటప్పుడు, చేసినదాన్ని సమర్థించుకోవడానికి, ఎగతాళి చేయడానికి, ఆరోపణలు చేయడానికి... అలవాటు బాగా ఉపయోగపడుతుంది.అలవాటు ముదిరితే వ్యసనంగా మారుతుంది. జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది. అది మహా ప్రమాదకారి. అలవాటు మనమీద పెత్తనం చేస్తోందా? లేక, దాన్ని మన అదుపులో ఉంచుకొన్నామా? అన్నది ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవాలి. అలవాట్లే గెలిపిస్తాయంటారు వ్యక్తిత్వ వికాస నిపుణులు. అందుకే, విజేతల అలవాట్లేమిటో తెలుసుకోవాలని కుతూహలపడుతుంటాం. దాని ఫలితమే- స్టీఫెన్ కవీ రాసిన, 'అత్యంత ప్రభావశీలుర ఏడు అలవాట్లు' అనే పుస్తకాన్ని కోట్లాది మంది చదివేశారు.మనం మన ఆలోచనను ఉన్నతీకరించుకోవాలని, అనుభూతిని సున్నిత పరచుకోవాలని అనుకొంటాం కానీ, అలవాటైపోయిన అనేక అంశాలను తరచి చూసుకోవాలని, ఎంతో కొంత మార్చుకోవాలని అనుకోం. ఎందుకంటే, అలా అలవాటైపోయింది! అలా హింస, దౌర్జన్యం, వివక్ష, కట్టడి, పరిమితులు, ఆంక్షలు, ఆధిపత్యాలు- ఇంటా బయటా వృత్తి వ్యవహారాల్లో... పిల్లలపై, స్త్రీలపై, బడుగుజీవులపై, తోటి మానవులపై, సాటి ప్రాణులపై, పర్యావరణంపై.. యథేచ్ఛగా వర్ధిల్లుతున్నాయి, మన ఆలోచనలతో అనుభూతులతో ప్రమేయం లేకుండా! ఇట్ ఈజ్ డిఫికల్ట్ టు బ్రేక్ బ్యాడ్ హ్యాబిట్స్, ఓల్డ్ హ్యాబిట్స్ డై హార్డ్... అన్నారు కదా. నిజమే, పాత అలవాట్లను మార్చుకోవడం కష్టం. అందులోనూ, దురలవాట్లను వదిలించుకోవడం మహాకష్టం. వదిలించుకోకుంటేనేమో... తీవ్ర నష్టం! అదీ అలవాటు ప్రభావం. ప్రతాపం!ఆ అలవాటు అనే గోడను దాటిరావాలన్నా, బద్దలుకొట్టాలన్నా, ఎగిరిదూకాలన్నా... అందుకు ఆయుధాలు మన ఆలోచన, అనుభూతులే. రియల్ టైమ్‌లో జీవిస్తూ, చేస్తున్న ప్రతిపనినీ అనుభూతించడం అలవరచుకుంటే- అలవాటు పొరపాటు అవ్వదు, గ్రహపాటుగా మారదు!

# విజయోత్సవాలు ముగిశాయి...హామీల సంగతేంది!

హైదరాబాద్,రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుని ఘనంగా విజయోత్సవ సంబరాలు చేసుకుంది. ఇందులో తప్పు పట్టవలసినది ఏమీ లేదు. ఐతే, విజయోత్సవాలు జరుపుకునే సందర్భంలో తాము ఏం సాధించాం అనేది చెప్పడం సంప్రదాయం. ఈ సంవత్సర కాలంలో ఏమైనా పొరపాట్లు చేశామా, తప్పుడు నిర్ణయాలు తీసుకున్నామా అని ఆత్మ పరిశీలన చేసుకోవాల్సన సందర్భం కూడా ఇదే. అయితే అధికార పార్టీలు సత్సంప్రదాయన్ని పాటించటం లేదు అనేది నిజం. పాలక పార్టీలు బలహీనపడడానికి కారణం కూడా ఇదే. ఇందుకు బీఆర్ఎస్ ఓటమే ఒక పెద్ద ఉదాహరణ. అధికారంలో ఉన్నపుడు ఆత్మపరిశీలన చేసుకొని ప్రజాభిప్రాయాన్ని అంచనా వేసుకుంటూ ముందుకు వెళ్లి వుంటే అంత సులభంగా ఓడిపోయేది కాదేమో. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో కొన్ని వాగ్దానాలు చేసింది. గెలిచిన తర్వాత ఆ వాగ్దానాలను అమలు చేయడానికి నానా తంటాలు పడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల మీద వడ్డీలు కట్టడం, అలాగే అప్పులో కొంతభాగం తీర్చడంలో ఆర్థిక వెసులుబాటు లేకుండా పోయింది. రైతాంగం అప్పులు మాఫీ చేయడానికి ఎంత ఇబ్బందిపడ్డారో చూసాం. ఈ రుణ మాఫీ సైతం రైతులు అందరికీ చేయలేకపోయారు. ఇక కౌలు రైతుల రుణాల సమస్య తీవ్ర సవాలుగానే ఉంది. కాంగ్రెస్ ఏడాది పాలనలో కౌలు రైతులు కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాబట్టి, రైతుల దురవస్థలను తొలగించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగానే అమలు చేస్తోంది. గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ సరఫరా చేస్తున్నారు, ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించి పరిమితిని పదిలక్షలు చేసారు. అందరికీ నాణ్యమైన వైద్యం ప్రభుత్వ రంగంలో అందేలా చర్యలు తీసుకోవాలి. ఈ చర్యలు తీసుకున్నా తెలంగాణ ప్రభుత్వం తనకు తాను కొన్ని సమస్యలను సృష్టించుకుంటున్నది. పారిశ్రామికీకరణలో భాగంగా అమెరికా వెళ్ళి పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపింది. చాలా ఉత్సాహంగా ముందుకు వచ్చాయి ఫార్మా కంపెనీలు. కాని ప్రపంచంలో చాలా దేశాలు ఈ పరిశ్రమను వదులుకుంటున్నాయి. మందుల ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకున్నది.. ఫార్మా పరిశ్రమలు విసర్జించే వ్యర్థ, విష పదార్థాలు పర్యావరణ భద్రతకు హాని చేకూర్చేవి. జల, వాయు కాలుష్యాలు సరేసరి. అందుకే సంపన్న దేశాలు ఆ పరిశ్రమలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలిస్తున్నాయి. కనుకనే భారత్ లాటి వర్ధమాన దేశాలు అడిగనదే తడవుగా చాలా పెద్ద ఎత్తున వస్తాయి. ఈ పరిశ్రమ అనుభవం దాని పర్యవసానం మన పటాన్‌చెరువు ప్రాంతాన్ని చూస్తే అర్థమవుతుంది. . అలాగే ఇంధన సమృద్ధిని సమకూర్చుకోవడానికి ఇథనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంట్లో భాగంగా తెలంగాణలో ఇలాంటి ముప్పై పరిశ్రమలు పెట్టాలనుకుంటున్నారు. రాష్ట్ర పాలకులు ఈ నిర్ణయాలు అమలు చేసేముందు నారాయణపేట జిల్లా చిత్తనూరు వెళ్ళి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు చూస్తే ఫార్మా పరిశ్రమను ప్రోత్సహించరు. మనం మన అనుభవాల నుండి ఎందుకు నేర్చుకోవడం లేదనేది ఒక చిక్కు ప్రశ్న.ఏ సమాజ అభివృద్ధికైనా విద్య, వైద్యం చాలా కీలకమైనవి. బీఆర్ఎస్ సర్కార్‌ని ఏ తప్పుకు అయినా



క్షమించవచ్చు కాని విద్యారంగ విధ్వంసం విషయంలో క్షమించడం చాలా కష్టం. తెలంగాణలోని ఏ విశ్వవిద్యాలయం గురించీ ఇప్పుడు గర్వంగా చెప్పుకోలేం. ఒకనాడు ఉస్మానియా విశ్వవిద్యాల యం దేశంలో అత్యంత ప్రతిష్ఠ గల ఐదారు విశ్వవిద్యాలయాలలో ఒకటి. బీఆర్ఎస్ ఎందుకు విద్యను ఇంత నిర్లక్ష్యం చేసిందో అర్థం కాదు. ఆ పార్టీ ఓటమికి అదొక బలమైన కారణం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తూనే విద్యావేత్తలు కలిసి ఈ సమస్యను ప్రస్తుత ప్రభుత్వానికి చాలా విపులంగా చెప్పారు. విద్యకు తమ మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన మేరకు 15శాతం బ్జడెట్‌లో కేటాయించాలని కోరారు. మరి 2024?25 వార్షిక బ్జడెట్‌లో గత బ్జడెట్ కంటే కేవలం 0.7శాతం మాత్రమే పెంచారు. విద్యా కమిషన్ నొకదాన్ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెప్పింది. ఎట్టకేలకు నియమించింది. కమిషన్ ఒకవైపు తన కర్తవ్య నిర్వహణ చేస్తున్న క్రమంలోనే స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఫాషన్ యూనివర్సిటీ అని ప్రకటించారు. ఇలాంటి విశ్వవిద్యాలయాలు ప్రారంభించినపుడు వాటి సాధకబాధకాల గురించి కమిషన్‌కి నివేదిస్తే ఆ నిపుణల సంఘం వాటిని పరిశీలించి ఇచ్చే సలహాల మేరకు విధాన నిర్ణయం చేయడం మంచిది. ఇక నిరుద్యోగ విషయం ఇదొక అంతు లేని సమస్య. నయా ఆర్థిక విధానాలు ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్యను పెంచుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నియామకాలు ఒక నినాదంగా ముందుకు వచ్చాయి. రాష్ట్రంలో కొన్ని వేల ఉద్యోగాలకి లక్షల మంది పోటీపడుతున్నారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేకపోవచ్చు కాని ఒక సమగ్రమైన ఎంఎ÷-లాయ్‌మెంట్ పాలసీ ఉండాలి. ఏ ఏ పరిశ్రమలు ఎక్కువ ఉద్యోగాలను సృష్టించగలవో పరిగణనలోకి తీసుకోవాలి. ఎలాంటి పారిశ్రామిక విధానం కావాలో సమగ్ర సమాలోచనలతో నిర్ణయించుకోవాలి. మొన్నటి ఎన్నికల్లో నిరుద్యోగ యువత కాంగ్రెస్ పార్టీ గెలుపుకి చాలా శ్రమపడింది. కాంగ్రెస్ నిపుణులతో ఒక కమిటీ వేసి ఈ మొత్తం సమస్యకు పరిష్కారమేమిటో సలహా ఇవ్వవలసిందిగా కాంగ్రెస్ కోరాలి. ఆ పార్టీ అధికారంలో ఒక ఏడాది కాలాన్ని పూర్తిచేసుకున్న సందర్భంలో ప్రభుత్వ సాఫల్య వైఫల్యాలను నిష్కర్షగా చెప్పడం సముచితం. పార్టీ హితవరులు చేసే హెచ్చరికల మేరకు ప్రభుత్వపరంగా జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని సుపరిపాలననందించడం తెలంగాణలోను, దేశ వ్యాప్తంగాను జాతీయ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు అత్యవసరం.

# ఏపీ నూతన పర్యాటక పాలసీ 2024-29 రిలీజ్

అమరావతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన పర్యాటక పాలసీ 2024 - 29 జీవో (ఎం.ఎస్. నంబర్ 17) ను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. 2025, మార్చి 31తో పాత టూరిజం పాలసీ ముగియనుడటంతో నూతన పర్యాటక పాలసీని సర్కార్ రూపొందింది. స్వర్ణాంధ్ర టూరిజం పాలసీ -2029లో పలు ముఖ్యాంశాలను పొందుపర్చారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పనతో రాష్ట్ర పర్యాటకానికి ఊతం లభించనుంది. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, ఆర్థిక పురోభివృద్ధికి ప్రోత్సాహం, ఉద్యోగాల కల్పన, సాంస్కృతిక మార్పిడి సులభతరం చేసేలా పాలసీ రూపకల్పన చేశారు. రాష్ట్ర గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ)లో పర్యాటక రంగం వాటా 4.6 శాతం నుంచి 8 శాతానికి పెంచడంతో.. 20 శాతం పైబడి జీవీఏను కంట్రిబ్యూట్ చేయాలన్నది సర్కార్ యోచన. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలను 12 శాతం నుంచి 15 శాతానికి పెంపొందించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం, విదేశీ పర్యాటకుల రాకలో టాప్ 10 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని చేర్చేలా పర్యాటక పాలసీని రూపొందించారు. పర్యాటకుడు పెట్టే ఖర్చును (సగటు వ్యయం) రూ.1700 నుంచి రూ.25000 కు పెంచారు. ఏదైనా పర్యాటక ప్రాంతంలో పర్యాటకులు 1 నుంచి 5 రోజులు ఉండేలా మౌలిక వసతులను కల్పించేలా ఏర్పాట్లు చేయనున్నారు. రాష్ట్రంలో పర్యాటకులకు వసతి సామర్థ్యం పెంచే ప్రక్రియలో భాగంగా హోటళ్లలో గదుల సంఖ్యను 3,500 నుంచి 10,000కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక పర్యాటకాన్ని, జనసమూహాలను బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నారు. దీర్ఘకాలిక పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. సుస్థిరమైన పర్యాటకాభివృద్ధికి బాటలు వేస్తూ.. పర్యాటక రంగంలో ఉండే వారికి శిక్షణ ఇచ్చి.. వారిలో నైపుణ్యాలు పెంపొందేలా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోనున్నారు. పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పన.. ప్రపంచ స్థాయి అనుభవాలను పర్యాటకులకు అందించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్ది అగ్రస్థానంలో నిలబెట్టాలే చర్యలు తీసుకోనున్నారు. స్థిరమైన పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. బాధ్యతాయుతమైన పర్యాటకానికి శ్రీకారం చుట్టారు. రివర్ క్రూయిజ్‌లు, ఆధ్యాత్మిక పర్యాటకం, ఎకో, వెల్‌నెస్, హెరిటేజ్, అడ్వెంచర్, బీచ్ టూరిజంలను అభివృద్ధి చేయనున్నారు. విశాఖపట్టణం, తిరుపతి, అరకు వ్యాలీ, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, గండికోట ప్రాంతాల్లో యాంకర్ హబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 25కు పైగా థీమాటిక్ సర్క్యూట్‌లు.. అం దులో 2 బుద్దిస్ట్ సర్క్యూట్‌లు, 10 టెంపుల్ సర్క్యూట్‌లు, 5 బీచ్ సర్క్యూట్‌లు, 4 రివర్ క్రూయిజ్ సర్క్యూట్‌లు, 3 ఎకో టూరిజం సర్క్యూట్‌లు, 2 సీ క్రూయిజ్ సర్క్యూట్‌లు, సీప్లేన్ సర్క్యూట్‌లు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో 40 బౌద్ధ స్మారక చిహ్నాలు, చారిత్రక మహాయాన బౌద్ధ మతం యొక్క జన్మస్థలంగా ప్రాముఖ్యత, గొప్ప బౌద్ధ వారసత్వంను, చారిత్రక, పురావస్తు అభివృద్ధి చేసేందుకు చర్యలు.. అందులో భాగంగా విశాఖపట్టణం, శాలిహుండం, తొట్ల కొండ, బొజ్జన కొండ, అమరావతి స్థూపం, ఉండవల్లి గుహలు, నాగార్జున కొండ ప్రధానమైనవి. ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా స్థానికంగా ఉన్న జ్యోతిర్లింగాలు, శక్తిపీఠాలు, శైవక్షేత్రాలు తదితర ఆలయాలు కలిసేలా సర్క్యూట్ లు.. సింహాచలం, శ్రీశైలం, అహోబిలం, అన్నవరం, తిరుపతి, కాణిపాకం, లేపాక్షి, విజయవాడ, ద్వారకాతిరుమల, శక్తి పీఠాల అభివృద్ధి చేయనున్నారు.

# అందాల అరకు పిలుస్తోంది...



అరకు : అల్లూరి సీతారామరాజు జిల్లా మణిహారం ప్రముఖ పర్యాటక కేంద్రం ఆంధ్రా ఊటీ అరకు వ్యాలీలో పర్యాటకం సందడి చేస్తోంది. ఈ వ్యాలీ అద్భుత అంద చందాలను తనివితీరా ఆస్వాదించేదుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రేమికులు తరలివస్తున్నారు. ఈ సీజన్లో కనులకు కనువిందు చేసే వలిసె పూల తోటల సొగసులు, వేకువ జామునే మైమరపించే దట్టమైన మంచు సోయగాలు.. ప్రకృతి రమణీయ సుందర అపురూప దృశ్యాలతో ఆకట్టుకుని ఆనంద భరితులను చేసే సుంకరమెట్ట కాపీ తోటల సౌందర్యాలు.. గాలికొండ వ్యూ పాయింట్ నుంచి లోయల సుందర దృశ్యమాలికలు సిద్ధమవుతున్నాయి. ఘాట్ రోడ్డులో బొంగులో చికెన్ ఘుమ ఘుమలాడుతోంది. పలకరింపులకు చిట్టిపొట్టి మిరియాల తోటలు దోబూచులాట ప్రారంభమైంది. కార్తీక మాసం ముగిసినా.. సంక్రాంతి సంబురాల హోరు .. శివరాత్రి జాగారం వరకు అరకు లోయలో పర్యాటక జనజాతర జరుగుతుంది. అరకులోయలో ఇక ఉరుకులు పరుగులే .. మరి ఇక్కడ అద్భుతాలేంటీ? అక్కడకు చేరటం ఎలా? అరకు అందచందాలను కనులారా వీక్షించి.. అపురూప జ్ఞపకాలతో ఇంటికి చేరటం ఎలా? అరకులోయకు చేరాలంటే రోడ్డు, రైలు మార్గం కాకుండా ఇంకా అనేక మార్గాలు ఉన్నాయి.

విశాఖలో బస్సెక్కి.. ఆ తర్వాత రైలెక్కి..

సాగరతీరం విశాఖపట్టణం నుంచి 112 కిలోమీటర్ల దూరం అరకులోయ ఉంది. విశాఖ బస్ స్టేషన్ లో ఉదయం అయిదు గంటల నుంచి డీలక్స్, పల్లె వెలుగు బస్సులు హారన్ మోగుతుంది. గంట గంటకూ ఓ బస్సు ప్లాట్ఫారం మీద ప్రత్యక్షమవుతుంది. ఇక రైలు మార్గంలో ప్రయాణం మహాద్భుతం. వాల్తేరు రైల్వే స్టేషన్ (విశాఖపట్టణం రైల్వే స్టేషన్ ) లో ఉదయం 6.50 గంటలకు కిరండోల్ ప్యాసింజర్ ఉంటుంది.ఈ రైలులో ప్రయాణించే పర్యాటకుల్ని బొర్రా గుహలు స్వాగతం పలుకుతాయి. అక్కడ నుంచి సమీప దూరంలోని బొర్రా గృహాలు, గోస్తనీ నదీ ప్రాంతంలోని కమనీయ రమణీయ దృశ్యాలను తిలకించి మైమరిచిపోక తప్పదు. ఒకప్పుడు బొర్రా గృహాలకు చేరాలంటే పర్యాటక జనం అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రస్తుతం రోజులు మారాయి. అరచేతిలో అన్ని సదుపాయాలు పలకరిస్తున్నాయి, రైలు సదుపాయం సరే. రోడ్డు మార్గంలో బస్సులు, కార్లు, జీపులు, ఆటోలు, బైకుల్లో బొర్రా గృహాలకు చేరిపోవచ్చు. ప్రకృతి సహజ సిద్ధంగా వెలసిన ఈ అద్భుత అందాలతో బొర్రా గృహాలు పర్యాటకులను మారో మరో ప్రపంచానికి తీసుకువెళ్తుంది. నిటారు కొండలు.. కళ్లుతిరిగే లోయల నుంచి గలగల జలజల పారే ప్రవాహం.. అద్భుత శిలల సౌందర్యం బొర్రా గృహాల సొంతం. అద్భుత అదృశ్య శిల్పి చెక్కాడేమో ? అన్నట్టు ఈ స్వయం సహజ సిద్ధ అద్భుత అలంకరణలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి

కొంటె చూపుల కటికి జలధార

బొర్రా గుహలకు ఆరు కిలోమీటర్ల దూరంలోని కటికి జలపాతం అత్యంత అద్భుత సందర్శనీయ ప్రాంతం. తలెత్తి చూస్తేగానీ కనిపించని కొండ శిఖరం నుంచి గలగల జాలువారే ఈ కటికి జలపాతం సుందర దృశ్యమాలిక అనిర్వచనీయం. చల్లని చిరుగాలి.. నీటి తుంపరల జల్లుల్లో జలకాలాట అద్భుతం. అమోఘం. ఇక ఘాట్ రోడ్డలోకి రాగానే సుంకరమెట్ట కాఫీతోటలు సిగ్గుమొగ్గలేస్తాయి. అంతే ఘాట్ రోడ్ లో కాఫీ స్టాల్స్ పలకరిస్తాయి. వేడివేడి చిక్కటి కాఫీ రుచితో ఔరా.. ఇందుకేనా కమ్మటి అరకు కాఫీ అని ఇంటర్నేషనల్ కమ్యూనిటీ పొగుడ్తోంది. అని పర్యాటకులు సంబరపడిపోతారు. గర్వంగా ఫీల్ అవుతారు. ఆ తరువాత అరకు ఘాట్ రోడ్ లో గాలికొండ వ్యూ పాయింట్ ఆగాల్సిందే. ఎందుకంటే ఈ వ్యూ పాయింట్ నుంచి బాక్సైట్ కొండల్ని తిలకించి మురిసి పోవచ్చు. వందల అడుగుల లోయలు మలుపులు తిరిగే రైల్వే ట్రాక్ దృశ్యాలను చూసి ఆశ్చర్యపడాల్సిందే. ఎందుకంటే.. ఈ రైలు ట్రాక్ పనులు ఎలా జరిగాయి?. ఎంత మంది పని చేశారు?. ఈ పనిలో కూలీలు ఎంతమంది చనిపోయారు.? వామ్మో వాళ్లు సామాన్యులు కాదు అనుకుని బుగ్గలు నొక్కుకోవాల్సిందే. ఇది సరే లోయ కొండల నడుమ గిరిజన గ్రామాలూ పలకరిస్తాయి.

కాళ్లకింద పాల కడలి కళ్లల్లో మెరిసే క్షీర సాగర హేళి

ఇక అరకు లోయకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని మాడగడ మేఘాలకొండ అపురూప దృశ్యాలు పర్యాటకుల మదిని దోచేస్తుంది. వేకువజామునే భానోదయ అద్భుత కిరణాలు.. పాలకడలిని తలపించే మంచు పరవళ్లు .. ఒక్కసారిగా మేఘాలే తాకింది హైహైలెస్స, నవరాగంలో నవ్వింది నా మోనాలిసా, ఈ గాలి రేపింది నాలో నిష, చేలరేగాలి రమ్మంది హల్లో అంటు ఒళ్లోవాలే అందాల ఈ అప్సరస మేఘాలే తాకింది హైహైలెస్స అని పల్లవి అందుకుని థింసా స్టెప్పును దంచక తప్పదు. ఆకాశంలో కనిపించే మబ్బులు తమ పాదాలను తాకాయని పర్యాటకులు సంబురం చేస్తారు. అంతే కాదు అరకు గిరిజనం సాంప్రదాయ దుస్తులను ధరించి థింసా నృత్యాలో చెలరేగిపోతారు. గిరిజనంతో తమ ఆనందానుభూతిని పంచుకొంటారు. మళ్లీ వస్తాం అంటూ టాటా వీడ్కోలు అంటూ బై బై చెబుతారు.. మాడగడ మేఘాల కొండను చేరటానికి రెండు దారులు ఉన్నాయి. అరకులోయ ప్రధాన రహదారిలో బోస్ బేడ గ్రామం నుంచి నేరుగా మేఘాల కొండకు వెళ్ళవచ్చు ఇది అయిదు కిలోమీటర్ల మార్గంలోని ఉంది. ఇక అరకులోయ పట్టణంలో బస చేసే పర్యాటకులు కొత్తవలస.. చొంపై బస్కి రహదారి మార్గంలో కూడా మేఘాలకొండకు చేరవచ్చు. ఇక్కడ నుంచి కేవలం 7 కిలోమీటర్ల దూరంలోనే పాల సముద్రం పలకరిస్తుంది. మాడగడ పాలసముద్రం అద్భుత అపురూప అందాలను తిలకించాలంటే వేకువ జామున అయిదు గంటలకు మేఘాల కొండకు చేరుకోవాలి.

ఎన్నెన్నో అందాలు.. హద్దే లేని ఆనందం

ఇక అరకు సుందరిని కనులారా చూస్తే చాలు ఎన్నెన్నో అందాలు .. ఏవేవో రాగాలు వేసే పూల బాణం.. కూసే గాలి గంధం,, పొద్దేలేని ఆకాశం హద్దేలేని ఆనందం.. ఎన్నెన్నో అందాలు ఏవేవో రాగాలు పాట పాడేస్తారు. ఈ లోయలో కనువిందు చేసే చూడచక్కని ప్రాంతాలకు కొదువ లేదు. గిరిజన సంప్రదాయాలకు అద్దం పట్టే మ్యూజియం, ఎన్నో అద్భుత వనమూలికలు, ఔషధ మొక్కలు, పురాతన ప్రసిద్ధి గాంచిన వన వృక్షాలు, పుష్పజాతుల సమాహారాన్ని తిలకించి పులకరించాలంటే పద్మాపురం ఉద్యానవన కేంద్రానికి వెళ్లాల్సిందే. అరకులోయ పట్టణ కేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఈ పద్మాపురం పలకరిస్తుంది. ఈ గార్డెన్ నుండి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోని రణ జల్లాడ జలపాతం, 14 కిలోమీటర్ల దూరంలోని చాపరాయి జలవిహారిలో ఈ అందాలను వీక్షించాలంటే అద్భుత రాదారి అందుబాటులో ఉంది. అరకు లోయ .. పాడేరు ప్రధాన రహదారిలో ఈ చాపరాయి జలపాతం అద్భుత సుందర కావ్యం.

# ముందే పసిగట్టిందా?

హైదరాబాద్,మొత్తానికి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ సాక్షిగా షాక్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తే.. చివరి నిమిషంలో తప్పించుకున్నారనే చర్చ జరుగుతోంది.పార్టీలకైనా, వ్యక్తులకైనా విమర్శలు, ఆరోపణలు, నిందలు వందలుగా వస్తూనే ఉంటాయి. కానీ ఒకే ఒక లాజిక్ పాయింట్ వాటన్నింటిని పటాపంచలు చేసే బ్రహ్మాస్త్రం అవుతుంది.. అలాంటి పవర్‌ఫుల్ అస్త్రాన్ని ప్లాన్ చేసుకున్నారట సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ తల్లి విగ్రహ వివాదంపై అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్షాల నోరుమూయించేందుకు ఈ అస్త్రన్ని సంధించాలనుకున్నారట. ముందే గ్రహించిన బీఆర్ఎస్ దీంతో రూట్ మార్చిందంట.. ఇంతకీ రేవంత్ రెడ్డి లాజిక్ పాయింట్ ఏంటి? గులాబీ నేతలు ఎందుకు డైవర్షన్ పాలిటిక్స్ ఏంటి..? జస్ట్ వాచ్ ఇట్..

అదే లాజిక్‌తో అసెంబ్లీలో బీఆర్ఎస్‌ను కార్నర్?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాజిక్ పాయింట్ అదిరిపోయిందా? అదే లాజిక్‌తో అసెంబ్లీలో బీఆర్ఎస్‌ను కార్నర్ చేయాలనుకున్నారా? అంటే అవుననేది పొలిటికల్ సర్కిల్స్ టాక్.. ఐతే చివరి నిమిషంలో మ్యాటర్ లీకై బీఆర్ఎస్ ట్విస్ట్ ఇచ్చిందని తెలుస్తోంది.. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై కొన్నాళ్లుగా రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ వేదికగా దీటుగా సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి భావించారట.పదేళ్లు పవర్‌లో ఉండి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా ఏర్పాటు చేయలేదని కడిగిపారేయాలనుకున్నారని సమాచారం. ఐతే విషయం ముందే గ్రహించి ప్రభుత్వమే తమను అసెంబ్లీకి రాకుండా అడ్డుకునేలా పథకం ప్రకారం తప్పించుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.భరతమాత, తెలుగు తల్లి, తెలంగాణ తల్లి.. ఈ విగ్రహ రూపాలు భావోద్వేగాలకు ప్రతీకలు. మన సంస్కృతికి అద్దంపట్టే వేదికలు. ఐతే తెలంగాణలో మాకో తల్లి, మీకో తల్లి అన్నట్టు పరిస్థితి మారిపోయింది. బీఆర్ఎస్ హయాంలో ఉన్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. తల్లి విగ్రహం మారడంతో రాష్ట్ర రాజకీయాల్లో మాటల మంటలు చెలరేగుతున్నాయి. అది మూమ్మాటికీ కాంగ్రెస్ తల్లి అంటూ ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నాయి.ప్రతిపక్షాల కామెంట్స్‌కు అసెంబ్లీ వేదికగా అదిరిపోయే సమాధానమిచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటి వరకు రాష్ట్రంలో అధికారికంగా గుర్తించిన తెలంగాణ తల్లి విగ్రహం లేదనే విషయాన్ని కుండబద్ధలు కొట్టారు. ఉద్యమం నాటి నుంచి బీఆర్ఎస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహమే ప్రాచుర్యంలో ఉందని తేల్చిచెప్పారు. కానీ ఎక్కడా ఇప్పటి వరకు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని తేల్చి చెప్పారు.

సెంటిమెంట్‌ను తట్టిలేపాలనుకున్న బీఆర్ఎస్?

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో కడిగిపారేయాలని మొదట బీఆర్ఎస్ భావించిందట. మరోసారి తెలంగాణ సెంటిమెంట్‌ను తట్టిలేపాలని భావించారట. కానీ సీఎం రేవంత్ రెడ్డి లాజిక్ పాయింట్ గురించి ముందే తెలుసుకున్న బీఆర్ఎస్.. సైలెంట్‌గా వెనుకడుగు వేసింది. పదేళ్లలో తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా ఏర్పాటు చేయలేదని ప్రభుత్వం ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సి వస్తుంది.. ఒకవేళ అసెంబ్లీకి హాజరుకాకుంటే అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తారు.పొలిటికల్‌గా కార్నర్ కావాల్సి వస్తుంది.. అందుకే బీఆర్ఎస్ లీడర్స్ డైవర్షన్ గేమ్ ప్లాన్ చేశారని పొలిటికల్ టాక్.. అందుకే చివరి నిమిషంలో సీఎం రేవంత్, అదానీ కలసి ఉన్న ఫోటోలతో కూడిన టీషర్ట్‌లు వేసుకుని అసెంబ్లీ బాట పట్టారు. నిజానికి విగ్రహ వివాదం వేళ.. అదానీ అంశంతో సంబంధమే లేదు. బీఆర్ఎస్ నేతలు పాత తెలంగాణ తల్లి విగ్రహం ఫోటోతో ఉన్న టీషర్టులు వేసుకొచ్చినా..

## సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా నాగబాబు..!

అమరావతి,ప్రముఖ నటుడు, మెగా బ్రదర్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో కీలక పదవి వరించిన విషయం తెలిసిందే. ఏపీ కేబినెట్‌లో ఆయనకు చోటు లభించింది. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఏ మంత్రిత్వ శాఖ కేటాయిస్తారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. అయితే, తాజాగా అందుతున్న సమాచారం మేరకు నాగబాబుకు సినిమాటోగ్రఫీ శాఖను కూటమి ప్రభుత్వం అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం జనసేన పార్టీ నేత కందుల దుర్గేశ్ ఈ శాఖను నిర్వర్తిస్తున్నారు. దీంతోపాటు టూరిజం శాఖ కూడా దుర్గేశ్ వద్దే ఉంది. అయితే, దుర్గేశ్ నుంచి సినిమాటోగ్రఫీ శాఖను నాగబాబుకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. దుర్గేశ్ సొంత పార్టీ నేతే కావడంతో ఆయన నుంచి ఈ శాఖను నాగబాబుకు బదిలీ చేయడం సులభతరం అవుతుందనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇక చిత్రపరిశ్రమకు చెందిన నాగబాబుకు ఈశాఖ కేటాయించడం వల్ల ఇటు ఇండస్ట్రీ, అటు ప్రభుత్వం మధ్య వారధిగా ఉంటారని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో గనుల శాఖ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ అంశంపై మరో రెండు లేదా మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## 16 నుంచి ధనుర్మాసం..

## స్వామివారికి ప్రత్యేక సుప్రభాతం

తిరుపతి, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో ధనుర్మాసం కీలకమైంది. ఈ నెల 16 నుంచి ధర్మాసం ప్రారంభం కానున్నది. ఆ రోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు మొదలవనున్నాయి. జనవరి 14 వరకు ధనుర్మాస ఘడియలు ముగుస్తాయి. ఈ క్రమంలో 17వ తేదీ నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహించనున్నారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ తదితర ప్రసాదాలను నివేదిస్తారు. పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి ఒకటిన్నర గంట ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. 12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరు. ఆమెను నాచియార్ అని కూడా పిలుస్తారు. వేంకటేశ్వరస్వామివారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

## జడ్జీలను వరించిన మంత్రి పదవులు

హైదరాబాద్, జబర్దస్త్.. ఈ పేరు వినగానే మొములో నవ్వులు పూస్తాయి.. తొలినాళ్లలో రోజా, నాగబాబు నవ్వుల స్పందనకు టీవీ ప్రేక్షకులు మంత్ర ముగ్దులు అయ్యారు. ఇదే వేదికపై వీరిద్దరిలో రోజా చెణుకులు, నాగబాబు ప్రశంసలు అందరినీ అలరించాయి. ప్రస్తుతం వీరిద్దరూ జబర్దస్త్‌కు గుడ్‌బై చెప్పేసినా.. జనాల మదిలో వీరు జబర్దస్త్‌గానే నిలిచిపోయారు. కొంతకాలం టీవీ ఫ్రేములో ప్రేక్షకులను అలరించిన ఈ సినీ జడ్జీలు ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో జనం మదిలో అభిమాన నాయకులయ్యారు. జబర్దస్త్ కుర్చీ యోగం కాస్త వీరిద్దరికీ అమాత్య హోదాను అందించిందనే చర్చ జరుగుతోంది. వైసీపీ హయాంలో రోజా పర్యాటక, క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. తాజాగా కొణిదెల నాగబాబును మంత్రి పదవి వరించింది. ఇక హోదా నిర్ధారణే ఆలస్యం.

రాజకీయాల్లో ఓడి గెలిచిన రోజా..

ఇద్దరూ టాలీవుడ్ స్టార్లే. ఒకరు హీరోయిన్.. మరొకరు విలక్షణ నటుడు, ప్రఖ్యాత సినీ నిర్మాత. వీరిని ప్రేక్షక అభిమానులు రాజకీయ దృష్టితో ఎప్పుడూ చూడలేదు. సొట్టబుగ్గల రోజా చిరునవ్వులకు జనం ఫిదా అయితే.. నాగబాబు తన సీరియస్ నటనతో అందరి గుండెల్లో నిలిచిపోయారు. రోజా లేనిదే జబర్దస్త్ లేదు అనేంతలా కార్యక్రమం నడిచేది. 2004లో రోజా పొలిటికల్ వైపు మళ్లారు. రాజకీయాల్లో పునాది వేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నగరి నియోజకవర్గంలో రెండు సార్లు ఓడిపోయారు. ఇక.. రోజా రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమే అని అంతా అనుకున్నారు. కానీ, 2014 నుంచి ఆమె జీవితం మలుపు తిరిగింది. వైసీపీ నాయకురాలిగా, నగరి ఎమ్మెల్యేగా తన సత్తా చాటారు. 2019 ఎన్నికల్లోనూ విజయం సాధించినా ఆమెకు పదవి రాలేదు. 2020లో ఏపీ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన మండలి చైర్మన్‌గా కేబినేట్ హోదా లభించింది. 2022లో మంత్రిగా అవకాశం దక్కింది.

జనసేనానికి అండగా..

మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీకి చెందిన కొణిదెల నాగబాబు నటుడిగా.. నిర్మాతగా జనం మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. 2013 నుంచి 2019 వరకూ జబరదస్త్ జడ్జీగా వ్యవహరించారు. సహజ సహనశీలిగా ఉన్నారు. 2019లో నాగబాబు కెరీర్ కాస్త పొలిటికల్ స్క్రీన్‌పైకి మళ్లింది. జనసేన ప్రధాన నాయకుడిగా.. నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థిగా పోటీచేశారు. 2,50,289 ఓట్లు వచ్చాయి. ఇక్కడ సినీ గ్లామర్ పని చేయలేదు. కానీ నాగబాబు నీరసపడలేదు. ప్రజలతో మమేకం అయ్యారు. తమ్ముడు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ వెంటే పయనించారు. అయిదేళ్లు జనసేన పార్టీలో కార్యకర్తలకు అండగా నిలిచారు.

చంద్రబాబు సముచిత నిర్ణయం..

2024 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి ఎంపీ స్థానంలో నాగబాబు పోటీ చేస్తారని అందరూ భావించారు. కానీ, కూటమి నిర్ణయాలకు కట్టుబడ్డారు. పార్టీ కోసమే ఆలోచించారు. కూటమి ప్రభుత్వంలో అత్యుత్తమ స్థానం దక్కాలని జనసైనికులు ఎదురు చూశారు. రాజ్యసభ సభ్యుడి హోదా లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు.. కానీ కథ కీలక మలుపులు తిరిగింది. రాజ్యసభ స్థానంలోనూ అవకాశం దక్కలేదు. మళ్లీ త్యాగమే తెరమీదకు వచ్చింది. ఆయన సహనశీలత్వానికి సముచిత గౌరవం ఇవ్వటానికి టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

అదే వారికి మహామోగం..

చంద్రబాబు మంత్రి వర్గంలో అంతగా పనితీరు చూపని ఆరుగురు మంత్రులకు ఫ్యాక్ అప్ తప్పదు. ఈ స్థితిలో కొణిదెల నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

# కాలం తాకిడిలో సోషలిజం స్ఫూర్తి..



న్యూఢిల్లీ, దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు రాజ్యాంగ వత్రోత్సవం ముందురోజైన నవంబర్ 25న ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని చెప్పాలి. రాజ్యాంగం అవతారిక (ప్రియాంబుల్)లో 42వ సవరణ ద్వారా చేర్చిన సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలంటూ దాఖలైన కేసును కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ల ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో.. ఆ రెండు పదాల స్ఫూర్తిపై గత కొంత కాలంగా కొందరు చేస్తున్న అసంబద్ధ వాదనలను, వారు వ్యాప్తి చేసిన అయోమయాన్ని పటాపంచలు చేసినట్లయింది. దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అని, కొన్ని మతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 'సెక్యులర్' అని పేర్కొనడం హిపోక్రసీ (కపటత్వం) అని కొందరి వాదన. అందువల్ల ఆ రెండు పదాలను తొలగించాలంటూ 2020లో సుప్రీం కోర్టులో ఓ వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దానికి అనుబంధంగా మాజీ రాజ్యసభ సభ్యులు సుబ్రమణ్యస్వామి కూడా మరొక దావా వేశారు. ఈ రెండింటిని కలిపి విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం సరైన సమయంలో సరైన తీర్పును ఇచ్చింది. తెలుగులో స్వామ్యవాదంగా పేర్కొనే సోషలిజం పెట్టుబడిదారీ విధానానికి పూర్తి వ్యతిరేకమని చాలామంది భావన. పెట్టుబడిదారీ విధానంలో సామాన్యులు నష్టపోతారని, సంపన్నులకే లాభం అని, అదే సోషలిస్ట్ సమాజంలో అయితే వర్గ విభేధాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తారని అనేక సంవత్సరాలపాటు ప్రచారం జరిగిన మాట నిజం. నిజానికి 'సోషలిజం' కు విస్తృతార్థం ఉంది. దానిని గ్రహించలేనివారు దానిని తప్పుగా అన్వయించుకొని ఆ పదాన్ని, అదేవిధంగా సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు సోషలిజం లేదా సోషలిస్ట్ అనే పదాల విస్తృతార్థాన్ని చక్కగా విడమర్చి వివరిస్తూ.. "సంక్షేమ రాజ్యానికి కట్టుబడి ఉండటం, సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం సోషలిజం విధానంగా చూడాలి. రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్' అనే పదం ఉన్నంత మాత్రాన ఏదో ఒక ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని నిర్దేశించడం కాదు" అని చెప్పారు. సోషలిజం అనే భావనను చాలామంది పొరపాటుగా అర్థం చేసుకోవడం వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. ముఖ్యంగా, బ్రిటన్, అమెరికాలు అనుసరించిన ఆర్థిక విధానాన్ని పెట్టుబడిదారీ విధానంగా, సోవియట్ రష్యా అనుసరించిన విధానాన్ని సోషలిస్ట్ విధానంగా పిలుచుకోవడం జరిగింది. 20 శతాబ్ది ప్రథమార్థంలో, అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత్తోసహా ప్రపంచంలోని అనేక దేశాలు పలు పోరాటాలు చేశాయి. వర్ణవివక్ష, అణచివేత, హక్కుల ఉల్లంఘన, ఆర్థిక దోపిడీకి పాల్పడిన బ్రిటీష్ పాలకుల విధానాలను ఒక్క భారత్లోనే కాదు.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలు అనేకం తీవ్రంగా వ్యతిరేకించాయి. అదే సమయంలో సోవియట్ రష్యాలో కార్మికవర్గం సంఘటితమై జరిగిన విప్లవం ఈ దేశాలకు స్ఫూర్తి నందించాయి. పేదరికం, పీడన, బానిసత్వం వదిలించుకోవడానికి ఉద్యమాలే మార్గంగా భావించి ఆ బాటనే పట్టాయి. రెండవ ప్రపంచయుద్ధంలో 'ఫాసిజం' ఓటమి చెందడంతో సోవియట్ రష్యా అనుసరించే సోషలిస్ట్ నమూనాకు తృతీయ ప్రపంచ దేశాలో సానుకూలత వ్యక్తం అయింది. అదొక ఆదర్శవాద విధానంగా చూడబడింది. ఆ సమయంలోనే దేశంలో ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తులు, పార్టీల కారణంగా పలు రకాల విధానాలు, పద్ధతులు కలగలిసినప్పటికీ ప్రధానంగా స్వామ్యవాద భావనలు, స్వామ్యవాద విలువలే ప్రజల్ని ఎక్కువగా ఆకర్షించాయి. జాతీయతా భావన అందరిలో పెల్లుబుకింది. స్వాతంత్రోద్యమంలో ప్రధాన భూమిక వహించిన కాంగ్రెస్ పార్టీ 1931లో చేసిన కరాచీ రిజల్యూషన్లో చాలా స్పష్టంగా తమ విధానాన్ని ప్రకటించింది. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశ ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వానికి కట్టుబడి పని చేస్తామని తీర్మానించింది. స్వతహాగా సోషలిస్ట్ భావాలు గలిగిన డా? బి. ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యత స్వీకరించిన సందర్భంలో "దేశ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి సోషలిజం నిజమైన ఔషదాన్ని అందించగలదు" అని అన్నారు. రాజ్యాంగసభలో జరిగిన వాడివేడీ చర్చల సందర్భంగా డా? బి.ఆర్. అంబేద్కర్ తన వాదన వినిపిస్తూ "ఆర్థిక విధానం ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వకుండా భవిష్యత్ తరాల చేతులు కట్టేయడం సరికాదు" అని అన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం చేయడం అనే లక్ష్యం సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం ద్వారానే నెరవేరుతుంది కనుక ప్రత్యేకంగా 'సోషలిస్ట్' పదాన్ని రాజ్యాంగ పీఠికలో చేర్చలేదు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చొరవతో పార్లమెంట్ రాజ్యాంగానికి 42వ సవరణ చేసి రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలు చేర్చారు. ఆ సవరణ జరిగిన 44 సంవత్సరాల తర్వాత రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిజం పదాలను చేర్చడాన్ని తప్పుపడుతూ 2020లో సుప్రీం కోర్టులో కేసు వేయడంతోనే మళ్లీ 'సోషలిజం' స్ఫూర్తిపై గత 4 ఏళ్లుగా చర్చలు, వాదోపవాదాలు చోటు చేసుకొన్నాయి. ప్రముఖ న్యాయవాది నానీఫాల్కివాలా మన దేశంలో 'సోషలిజం' తప్పుగా బ్రాండ్ అయింది అని అన్నారు 1972లో. దేశంలోని పేదరికాన్ని సమానంగా పెంచడమే 'సోషలిజం'గా చెలామణి అవుతోందని వెటకారంగా అన్నారు. 'గరీబీ హటావో' (పేదరికాన్ని పారద్రోలాలి) అని ఇందిరాగాంధీ పిలుపునిస్తే.. కొందరు అమీరీ హటావో (సంపదను పారద్రోలాలీ) అని అర్థం చేసుకొంటున్నారని నానీఫాల్కీవాలా చమత్కరించారు. దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దేశంలో 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ'కు బాటలు పర్చినప్పటికీ దశాబ్దాలపాటు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నామమాత్రంగానే పెరిగింది. నెహ్రూ అనుసరించిన విధానాన్ని కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకించాయి. కమ్యూనిస్టు పార్టీ రెండుగా విడిపోయిన తర్వాత ఒకరు చైనా నమూనాను, మరొకరు సోవియట్ రష్యా నమూనాను సమర్థించారు. సోషలిజం విధానమే ఆదర్శప్రాయమైందన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. 'సోషలిజం' పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకమని.. పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదవాళ్ల శ్రమ దోపిడీకి గురవుతుందని బలమైన ప్రచారం జరిగింది. పరిశ్రమలన్నీ పెట్టుబడిదారీ యాజమాన్యం నుంచి కార్మికుల యాజమాన్యం క్రిందికి రావడమే సంపూర్ణ సోషలిజం లక్ష్యం అనే నినాదాలు దేశంలో చాలా కాలం విన్పించాయి. పరిశ్రమల్ని జాతీయం చేయాలని కొందరు కమ్యూనిస్టులు తరచుగా పిలుపునిచ్చేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించేవారందరూ అభ్యుదయ వాదులుగా పిలవబడ్డారు. సంపన్నులంతా దుర్మార్గులని, సామాన్యులు మంచివారనే నెరేటివ్లతో మెజార్టీ నవలలు, సినిమాలు కూడా వచ్చాయి. దీంతో సామాన్య ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడ్డాయి. అయితే, ఒక్క తూటా పేలకుండా, ఏ ఒక్క వ్యక్తి మరణించకుండా ఎప్పుడైతే సోషలిస్ట్ సోవియట్ యూనియన్ తనకుతానుగా కుప్పకూలిందో, అప్పట్నుంచీ సోవియట్ రష్యాలో అమలైన 'సోషలిజం' విధానాలకు నిజమైన అర్థమేమిటన్న అంతర్మథనం భారత్తో సహా చాలా దేశాలలో మొదలయింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ఆ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని లోపాలు అంతర్జాతీయ సమాజానికి వెల్లడయ్యాయి. దాంతో, ఏ దేశమూ తనకున్న పరిమిత ఆర్థిక వనరులతో పైకెదగలేదనిబీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడం అనివార్యం అని చాలా దేశాలు గ్రహించాయి. భారత్కు సంబంధించినంతవరకు 1991లో మొదలైన మొదటి దశ ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా పని చేశాయి. అప్పటివరకు దేశంలో రాజ్యమేలిన లైసెన్స్ రాజ్కు మంగళం పాడి.. ప్రజలందరికీ సమాన అవకాశాలను పొందే విధంగా అనేక రంగాల ద్వారాలను తెరవడం జరిగింది. దాంతో ప్రజలకు నిత్యావసరాలుగా మారిన వంటగ్యాస్, టెలిఫోన్ సౌకర్యం వంటివి సామాన్యులకు సైతం దక్కాయి. అదే సమయంలో అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడంతో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడి పరుగుపెట్టింది. దేశంలోకి పెట్టుబడులు రావాలని, పరిశ్రమల స్థాపన జరగాలని, దేశ సంపద పెరగాలని, పెరిగిన సంపద అన్ని వర్గాలకు చేరాలని.. అదే భారత రాజ్యాంగం ప్రవచించిన ఆర్థిక,సామాజిక న్యాయం అని పాలకులకు అర్థం అయింది. కనుకనే, దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తమకు అధికారం ఇస్తే ఆ పంథానే అనుసరిస్తామని ఎన్నికలలో హామీలిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలు హామీ ఇచ్చిన విధంగానే సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ.. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఇవ్వడంలో ఇంకా తాత్సారం చేస్తున్నాయి. నానా ఫాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను అందిస్తుంది. అవి దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని లభించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇదే. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరిగి సంపూర్ణ సోషలిజం అమలవుతుంది.

# అసద్ పతనం వెనుక అమెరికా దొంగ బుద్ధి!



పశ్చిమాసియా దేశం సిరియాలో తలెత్తిన పరిణామాలు ప్రపంచాన్ని దిగ్భాంరతికి గురి చేస్తున్నాయి. చమురు సంపన్నమైన ఈ ప్రాంతంలో రష్యా, ఇరాన్ పలుకుబడిని దెబ్బతీసి, తన ఆధిపత్యానికి ఎదురు లేకుండా చూసుకోవాలన్న అమెరికా పన్నాగంలో భాగమే సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌పై తిరుగుబాటు. గతంలో కూడా అరబ్ ప్రపంచంలో అంతర్యుద్ధాలను అమెరికా ఎలా ప్రోత్స హించిందో తెలియంది కాదు. సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు గత దశాబ్దన్నర కాలంగా అమెరికా కుట్రలు పన్నుతూనే ఉంది. ఉగ్రవాదంపై పోరాడుతున్నట్లు బయటకు కనిపిస్తూ అమెరికా, పశ్చిమ దేశాల దొంగ బుద్ధి సిరియాలో మరోసారి బయటపడింది. అసద్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు అల్‌ఖైదా మూలాలున్న జిహాదిస్టు గ్రూపులకు పశ్చిమ దేశాలు అధునాతన ఆయుధాలు, డబ్బు ఇచ్చి ఎలా ఎగదోసిందీ అందరికీ తెలుసు. సిరియాలో అసద్ పతనం వెనుక ప్రాంతీయ, అంతర్జాతీయ శక్తుల పాత్ర తక్కువేమీ లేదు. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన హయత్ తెహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) అధినేత అబూ అహ్మద్ అల్ జొలాని అమెరికా కస్టడీలో అయిదేళ్లు ఉండి 2011లో సిరియాలో తలెత్తిన తిరుగుబాటుకు ముందు విడుదలయ్యాడు. ఆ తిరుగుబాటును లేవనెత్తడంలో జొలానీ పాత్ర ఉంది. హెచ్‌టిఎస్, ఫ్రీ సిరియన్ ఆర్మీ, స్థానిక తీవ్రవాద గ్రూపులను అన్నిటినీ కలుపుకుని సిరియన్ నేషనల్ అలయెన్స్ పేరుతో కూటమి ఏర్పాటు చేసి అసద్ ప్రభుత్వాన్ని కూల్చడమే ఏకైక ఎజెండాగా సిరియాలో అలజడి సృష్టించాడు. పదకొం డు రోజుల క్రితం ఇడ్లిబ్‌లో మొదలైన తిరుగుబాటు అలెప్పో, హామ్ పట్టణాలను ఒక్కొక్క దానిని వశపరచుకుంటూ రాజధాని డమాస్కస్‌ను శనివారం రాత్రి ముట్టడించడంతో పారాకాష్టకు చేరింది. పరిస్థితి తీవ్రతను గమనించిన అధ్యక్షుడు అసద్ హింసను నివారించేందుకు శాంతియుతంగా అధికా ర బదలాయింపునకు వీలుగా దేశం వీడి కుటుంబంతో సహా రష్యాకు వెళ్లిపోయారు. సిరియా ప్రధాని జలీల్ అధికార మార్పిడిలో తిరుగుబాటు దారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రక టించడంతో రాజ్యాధికారం ఇప్పుడు జిహాదిస్టుల చేతుల్లోకి వచ్చింది. సిరియాపై ఆధిపత్యం కోసం విభిన్న గ్రూపుల మధ్య విభేదాలు ఎటువంటి మలుపు తీసుకుంటాయో చెప్పలేం. ఇంతలోనే సిరియాకు చెందిన గొలాన్ హైట్స్ భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి ఇజ్రాయిల్ భీకర దాడులు ప్రారంభించింది. 1967లో యుద్ధం తరువాత కుదిరిన ఒప్పందం ప్రకారం ఏర్పాటైన గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌లోకి ఇజ్రాయిల్ చొరబడడంపై అరబ్ లీగ్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇజ్రాయిల్ దురాక్రమణను ఆపాలని ముక్త కంఠంతో అవి డిమాండ్ చేస్తున్నా అమెరికా, వాటి మిత్ర పక్షాలు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. అసద్ పతనం తరువాత అమెరికా తదుపరి లక్ష్యం ఇరానేనని వార్తలొస్తున్నాయి. సిరియా పరిణామం తరువాత ఈ ప్రాంత రాజకీయ భౌగోళిక స్వరూపంలో పెను మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. తిరోగామి శక్తుల చేతుల్లో సిరియా భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు సర్వత్రా నెలకొన్నాయి. 1970లో అధికారంలోకి వచ్చిన హాఫీజ్ అల్ అసద్‌ను ఆధునిక సిరియా నిర్మాతగా పేర్కొంటారు. ఆయన వారసుడిగా 2000లో పగ్గాలు చేపట్టిన తనయుడు బషర్ అల్ అసద్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేశారు. అయితే, పశ్చిమ దేశాల ఆంక్షలు, అంతర్యుద్ధం వల్ల ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. సుమారు కోటీ 20 లక్షల మంది వలసపోయారు. ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోనే సుమారు 20 లక్షల మంది శరణార్థులుగా రోజులు నెట్టుకొస్తున్నారు.

## మానవాళిని కబళిస్తున్న కర్బన ఉద్గారాలు ..

కర్బన ఉద్గారాలు అనేక రకగాల అనర్థాలకు హేతువు అవుతున్నాయి. భూతాపం పెరిగిపోవడానికి, వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించడానికి ప్రధాన కారణం వాతావరణంలోకి వెలువడుతున్న ఈ కర్బన ఉద్గారాలే. అడవుల నరికివేత, గనుల తవ్వకం, బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు, ఉక్కు, సిమెంట్ కర్మాగారాలు, వంటచెరకు వినియోగం..ఇవన్నీ కర్బన ఉద్గారాలు పెరగడానికి కారణమవుతున్నాయి. ఫలితంగా, వాతావరణ సమతుల్యత రోజు రోజుకు మరింతగా దెబ్బతింటోంది. ఈ కర్బన ఉద్గారాల వల్ల భూమి పొడిబారుతోందంటూ వెలువడిన ఓ తాజా అధ్యయనం.. మానవాళికి పొంచి ఉన్న పెనుముప్పును కళ్లకు కడుతోంది. సౌదీ అరేబియాలోని రియాద్‌లో రెండు రోజుల క్రితం ఎడారీకరణ నిరోధానికి తీసుకోవలసిన చర్యలపై జరిగిన ఐక్య రాజ్యసమితి సదస్సు (యుఎన్ సిసిడి) ఓ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం..గత 30 ఏళ్లలో 77 శాతం భూమి పొడి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొందని, భూగోళంపై పొడి నేలల సంఖ్య 43 లక్షల చదరపు కిలోమీటర్లు పెరిగింది. ఇది మొత్తం భూభాగంలో 40 శాతం పైమాటే. కర్బన ఉద్గారాల విడుదలను అరికట్టకపోతే పెద్దయెత్తున భూములు పొడిబారిపోతాయంటూ నివేదిక హెచ్చరించింది. ఆసియా, మధ్య ఆసియా, పశ్చిమ అమెరికా, బ్రెజిల్, యూరప్‌లోని ప్రాంతాలకు ఎడారీకరణ ముప్పు పొంచి ఉందంటూ చేసిన హెచ్చరిక కలవరం కలిగించేదే. కర్బన ఉద్గారాల కారణంగా పొడిబారి, ఎడారీకరణకు గురవుతున్న నేలల్లో నివసించే వారి సంఖ్య ఇప్పటికే 230 కోట్లకు చేరుకుంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2100 నాటికి బాధిత జనాభా సంఖ్య 500 కోట్లకు చేరుకునే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే దక్షిణ సూడాన్, టాంజానియా దేశాలు పొడిబారిన నేలల వల్ల తలెత్తే దుష్పరిణామాలకు లోనవుతున్నాయి. కరవుకు గురైన ప్రాంతాలలో వర్షం పడితే అక్కడి నేలలు మళ్లీ సారవంతం కావచ్చు. కానీ పొడి వాతావరణం భూములను కబళిస్తే అవి సాధారణ స్థితికి వచ్చే అవకాశం లేదని సదరు సదస్సు హెచ్చరించిన నేపథ్యంలో కర్బన ఉద్గారాల విడుదలకు ప్రపంచ దేశాలు తక్షణమే నడుం బిగించవలసి ఉంది. కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కే పరిమితం చేయాలని ప్రపంచ దేశాలు చాలా ఏళ్ల క్రితమే పారిస్ ఒప్పందం ద్వారా ప్రతినబూనాయి. కానీ ఈ లక్ష్యసాధన దిశగా చేస్తున్న కృషి మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, ఈ శతాబ్దాంతానికి భూతాపం 3.1 డిగ్రీల సెల్సియస్ మేరకు పెరిగే ప్రమాదం గోచరిస్తోంది. కర్బన కాలుష్యం పెచ్చుమీరడానికి ధనిక దేశాలే కారణం. వీటిలో చైనా, అమెరికా, ఇండియా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇండియా విషయానికొస్తే, శిలాజ ఇంధనాల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్న కారణంగా 48 శాతం మేరకు కర్బన ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. దీనికి పరిష్కారం సౌర, పవన విద్యుత్ వైపు మొగ్గు చూపడమే. మన దేశం ఈ దిశగా ఇప్పుడిప్పుడే వడివడిగా అడుగులు వేస్తోంది. మరో ఆరేళ్లలో కర్బన ఉద్గారాలను 45 మేరకు తగ్గించుకోవడం, శిలాజేతర ఇంధన వనరుల నుంచి 50 శాతం విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని అందిపుచ్చు కోవడం లక్ష్యంగా నిర్దేశిరచుకుంది. వాతావరణ కాలుష్యం పెచ్చుమీరుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు శాస్త్రవేత్తల సహకారంతో ముందడుగు వేయవలసిన అవసరం ఉంది. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని అరికట్టేందుకు జీవ ఇంధనాలవైపు దృష్టి సారించడం మన ముందున్న ఓ పరిష్కార మార్గం. ఇంధన వినియోగంలో హైడ్రోజన్ వాటా పెంచడం మరో పరిష్కారం. అలాగే గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, భూగర్భంలో నిక్షిప్తం చేసేందుకు శాస్త్రవేత్తలు పేర్కొంటున్న 'కార్బన్ కాప్చర్, స్టోరేజీ' పరిజ్ఞానాన్ని కూడా ప్రభుత్వాలు పరిశీలించాలి. ఎడారీకరణతో తలెత్తే అనర్థాలను ఐక్యరాజ్య సమితి సదస్సు స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇకనైనా కళ్లు తెరవాలి.

## అనైక్యత...

న్యూఢిల్లీ,ఆరు నెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అనతికాలంలోనే నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచని పరిస్థితిలో పడినట్టు కనిపిస్తోంది. జార?ండ్, జమ్ము – కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుబాటలో పయనించినా, హర్యానా, మహారాష్ట్రల్లో ఎదురైన దిగ్భ్రాంతికరమైన పరాజయాలు ఇప్పుడు కూటమి భాగస్వామ్యపక్షాల మధ్య విభేదాల కుంపటిని రాజేస్తున్నాయి. హర్యానా ఎన్నికల్లో మితిమీరిన ఆత్మవిశ్వాసంతో చేజేతులా కాంగ్రెస్ ఓటమి కొనితెచ్చుకుంటే, మహారాష్ట్రలో మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ) సోదిలో లేకుండా పోవడమూ స్వయంకృతమేనన్న భావన అసమ్మతిని పెంచింది. ఖర్గే సారథ్యంలోని 'ఇండియా' కూటమిలో ప్రధానపాత్ర కాంగ్రెస్‌దే గనక మహారాష్ట్రలో దెబ్బతో అనూహ్యంగా నాయకత్వ మార్పు అంశం తెర మీదకొచ్చింది. సారథ్యానికి సిద్ధమంటూ మమత ముందుకు రావడంతో కథ మలుపు తిరిగింది.కూటమి ఆశించిన ఫలితాలు రావడం లేదన్న అసంతృప్తి పెరుగుతున్న పరిస్థితుల్లో అసలీ కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించినదే మమతా బెనర్జీ గనక ఇప్పుడీ కూటమికి ఆమే సారథ్యం వహించాలనీ, అందుకామె సిద్ధంగా ఉన్నారనీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ ముందుగా గళం విప్పారు. ఆ తర్వాత కొద్ది రోజులకే దీదీ ఓ ఇంటర్వ్యూ ఇస్తూ, 'కూటమిని వారు నడిపించ లేకపోతే, నేనే నడిపిస్తాను' అని కుండబద్దలు కొట్టేశారు. బెంగాల్‌ను వీడకుండా,అక్కడ నుంచే కూటమి సాఫీగా నడిచేలా చేస్తాననీ వ్యాఖ్యానించారు. దానికి కొనసాగింపుగా జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అగ్రనేత శరద్ పవార్ సైతం జాతీయ నేతగా మమత సమర్థురాలనడంతో తేనెతుట్టె కదిలింది. కూటమిలోని లుకలుకలు, కాంగ్రెస్ పట్ల ఇతర భాగస్వామ్య పక్షాల అసంతృప్తి, అసమ్మతి స్వరాలు బయటపడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), అలాగే రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ సహా పలువురు కోరస్ కలపడంతో విషయం వీధికెక్కింది. సీపీఐ సైతం సీట్ల సర్దు బాటులో వామపక్షాలకు కూటమి చోటివ్వడం లేదంటూ, కాంగ్రెస్ ఆత్మశోధన చేసుకోవాలనేశారు.నిజానికి, ఈ ఏటి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి కొంత ఊపు వచ్చినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బలతో అంతా నీరుగారింది. ఆ మధ్య హర్యానాలో దెబ్బ తినడమే కాక, తాజా మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి తుడిచిపెట్టుకుపోవడం అశనిపాతమైంది. ఆశలు క్షీణించడంతో హస్తం పార్టీ సారథ్యంపై అసమ్మతి స్వరం పెరిగింది. ఆ మాటకొస్తే తృణ మూల్ చాన్నాళ్ళుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటోంది. ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదు సరికదా పార్లమెంట్ సమావేశాల్లోనూ అంటీముట్టని వైఖరి. ఇటీవల ఎస్పీది సైతం అదే ధోరణి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో హస్తం పార్టీతో కలవడానికి ఇష్టపడకపోగా, పార్లమెంట్‌లో రాహుల్ ముందుండి నడుపుతున్న అదానీ వ్యతిరేక నిరసన ప్రదర్శనల్లోనూ తృణమూల్ లానే పాలు పంచు కోవట్లేదు. ఇది చాలదన్నట్టు రానున్న ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నట్టు ఆప్ ప్రకటించింది. అభ్యర్థుల పేర్లు విడతల వారీగా విడుదల చేసేస్తూ, చర్చలకు తావు లేకుండా చేసేసింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, ప్రతిపక్ష ఐక్యతకు చర్యలు ఆలోచించాలనీ శివ సేన (ఉద్ధవ్ బాల్‌ఠాక్రే) పేర్కొన్నదంటే వ్యవహారం ఎందాకా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలోని కాంగ్రెస్ శైలిపై అసంతృప్తి బాహాటమవుతున్న వేళ... ప్రతిపక్ష కూటమి భవిష్యత్ నేత ఎవరు, భవిష్యత్

# తెలంగాణలో ఐదేళ్లలో 1,03,496 మంది అదృశ్యం




వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో 'అదృశ్యం' కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వయోభేదాలు లేకుండా ఇంటినుంచి బయటికి వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకుండా తప్పిపోతుండటం కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో కొందరు, ఇంట్లో పెద్దలు మందలించారని ఇంకొందరు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో మరికొందరు కనిపించకుండా పోతున్నారు. ఇలా తప్పిపోతున్న వారి కుటుంబసభ్యులు సమీప బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేక.. చివరకు పోలీసుస్టేషన్లలో 'మిస్సింగ్'కేసులు నమోదు చేస్తున్నారు. ఫిర్యాదు చేసి కళ్లు కాయలు కాయేలా ఎదురుచూసిన కొందరికి తమ కుటుంబసభ్యుల ఆచూకీ దొరకగా.. మరికొందరికీ ఎదురుచూపులే మిగిలాయి. తప్పిపోయిన వారిలో కొంతమంది ఆచూకీ పోలీసులు కనుగొన్నా.. మరికొంతమంది ఆచూకీ మాత్రం దొరకడం లేదు.

అదృశ్యం కేసులపై హైకోర్టు తీవ్ర స్పందన

అప్పట్లో రాష్ట్రంలో పెరిగిన మిస్సింగ్ కేసులపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు 2014 నుంచి 2019 వరకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం.. ఏటా తొమ్మిది వరకు మిస్సింగ్ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. 2019 నుంచి 2020 నవంబర్ వరకు ఆ కేసులు రెట్టింపు అయ్యాయని హైకోర్టులో ఓ ప్రైవేట్ పిటిషన్ కూడా దాఖలైంది. అదృశ్యమైన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా ఉన్నట్టు కేసులు నమోదయ్యాయని పిటిషనర్ వివరించారు. దీనిపై ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో షీ టీమ్, దర్పన్ యాప్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, ఆపరేషన్ ముస్కాన్ లాంటి కార్యక్రమాల ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఆ తర్వాత కూడా 2020 నుంచి 2024 అక్టోబర్ 19 వరకు రాష్ట్రంలో 1,03,496 మంది బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీలు తప్పిపోయినట్లు కేసులు నమోదయ్యాయి. 2023లో అత్యధికంగా 23,509 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది డిసెంబర్ 19 నాటికి 20,403 కేసులు నమోదయ్యాయి. అదృశ్యమైన 1,03,496 మందిలో 97,028 మంది ఆచూకీ లభించగా, ఇంకా 6,468 మంది ఎక్కడ ఉన్నారో, ఏమైపోయారో తెలియని పరిస్థితి నెలకొంది.

'అదృశ్యం'కేసుల్లో మహిళలే ఎక్కువ..

తెలంగాణవ్యాప్తంగా ఐదేళ్లలో అదృశ్యమైన 1,03,496 మందిలో మహిళలే 54,744 మంది ఉన్నారు. పురుషులు 34,643 మంది, బాలురు 5,750 మంది కాగా బాలికలు 8,359 మంది. ఇదే సమయంలో ఆచూకీ లభ్యమైన వారి జాబితాలోనూ 52,312 మంది మహిళలు ఉండగా, 31,291 మంది పురుషులు, 5,450 మంది బాలురు, 7,070 మంది బాలికలు ఉన్నారు. ఆచూకీ దొరకని 6,468 మందిలో పురుషులు 3,352 మంది, మహిళలు 2,432 మంది, బాలురు 295 మంది, బాలికలు 389 మంది ఉన్నారు.

పరిష్కారం చూపాలి

రాష్ట్రంలో ప్రతీరోజు ఎంతోమంది తప్పిపోతున్నారు. కొంతమంది ఆచూకీ పోలీసులు కనుగొన్నా.. మరికొంతమంది ఆచూకీ మా త్రం దొరకడం లేదు. బాలికలు, బాలురు, మహిళలు, పురుషుల ఆచూకీ దొరక్క.. వారి కుటుంబాల బాధ వర్ణనాతీతం. ఇప్పటికీ ఆచూకీ తెలియని వారు చాలామంది ఉన్నారు. వారు బతికి ఉన్నారో, లేదో తెలియక క్షణక్షణం బాధ అనుభవిస్తూ ఉంటారు. వారి బాధకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉంది. ఇప్పటికైనా వారి ఎదురుచూపులకు పరిష్కారం చూపాలి. -%-% రాజేంద్ర పల్నాటి, ఫౌండర్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్

# ఆర్.కృష్ణయ్యతో ఈటలకు చెక్?




హైదరాబాద్,ఆర్ కృష్ణయ్యకు బీజేపీ రాజ్యసభ ఆఫర్ ఇవ్వడం వెనక ఉన్న సమీకరణలు ఏంటీ..? తెలంగాణలో బీసీ ఉద్యమ రథ సారథిగా ఆర్ కృష్ణయ్యను రంగంలోకి దింపేందుకు బీజేపీ స్కెచ్ వేస్తోందా..? బీసీ నేతగా ఈటెల రాజేందర్‌కు చెక్ పెట్టేందుకే ఆర్.కృష్ణయ్యను బీజేపీ పాత నేతలు తెర మీదకు తెచ్చారా..? బీసీ ముఖ్యమంత్రి నినాదం ఎత్తుకున్న తెలంగాణ బీజేపీలో ఆర్.కృష్ణయ్య ఏ రోల్ పోషించబోతున్నారు?బీసీ సామాజిక వర్గ ఉద్యమ నేతగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్.కృష్ణయ్య సుపరిచితులు. బీసీల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. 2014 లో టీడీపీ తరపున ఎల్బీ నగర్ నియోజకవర్గంలో నుంచి పోటీ చేసి విజయం సాధించిన ఆర్ కృష్ణయ్య, 2019 లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి 2022 లో వైసీపీ తీర్థం పుచ్చుకుని ఆ పార్టీ నుంచి రాజ్యసభకు ఎంపిక అయ్యారు. వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ ఇచ్చిన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.ఇక తాజాగా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కోటాలో ఆ పార్టీ నుంచి రాజ్యసభకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. బీసీ ఉద్యమ నేత, బీసీ సామాజిక వర్గాలల్లో మంచి పట్టున్న నేత కావడంతో అటు టీడీపీ, ఇటు బీజేపీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓటింగ్ శాతం పెంచుకునేందుకు భారీగానే ప్రణాళికలు వేస్తున్నాయనే టాక్ నడుస్తోంది. తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బరిలో దిగి బొక్కబోర్లా పడిన సంగతి తెలిసిందే . తెలంగాణ ప్రజలు బీజేపీ బీసీ నినాదాన్ని పెద్దగా పట్టించుకోలేదనే దానికి ఎన్నికల ఫలితాలు నిదర్శనంగా నిలిచాయి.మిషన్ 90 లక్ష్యంతో 90 అసెంబ్లీ స్థానాలు సాధిస్తామని, బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీ కేవలం 8 స్థానాలకే పరిమితం కావలసి వచ్చింది. బండి సంజయ్, ఈటెల రాజేందర్, రఘుందన్ రావు, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లాంటి హేమాహేమీలు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల అనంతరం బీజేపీ కార్యాలయంలో నాలుగు గోడల మధ్యనే పరిమితమైన పంచాయతీలన్నీ రచ్చకెక్కడంతో నేతలంతా పుట్టకొకరు, చెట్టుకొకరు అన్నట్టుగా తయారైంది. ఇక రాష్ట్ర బీజేపీలో ఈ పంచాయితీలకు చెక్ పెట్టేందుకు డిల్లీ పెద్దలు భారీ స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది.రాష్ట్ర బీజేపీ ఇప్పటికే కొత్త, పాత నేతల పంచాయితీలతో సతమతమవుతుంది. గత ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేక పోయామన్న అంతర్మధనం పార్టీలోని పాత నేతల్లో కనిపించడం లేదు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి ఎంపికకు సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించుకునే పనిలో పార్టీ ఉంది. పార్టీ అధ్యక్షుడిగా బండి సంజయ్ తొలగింపు తరువాత, మళ్ళీ కిషన్ రెడ్డికే అధ్యక్ష పదవి కట్టబెట్టారు. ప్రస్తుతం బండి సంజయ్, కిషన్ రెడ్డిలిద్దరూ కేంద్ర మంత్రుల హోదాలో ఉన్నారు. సంస్థగత ఎన్నికలు జరుగుతుండటంతో అధ్యక్షుడు ఎవరనే సస్పెన్స్ కాషాయ పార్టీలో కొనసాగుతుంది.ప్రస్తుతం బీజేపీ అధ్యక్షుడిగా ఈటెల రాజేందర్ ఎంపికవుతారన్న ప్రచారం బలంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా బీసీ నేత ఆర్ కృష్ణయ్యను తెర మీదకు తీసుకు రావడం ఈటెల రాజేందర్ కు చెక్ పెట్టేందుకే అన్న చర్చ మొదలైంది. ఈటెల రాజేందర్ కన్న ఆర్ కృష్ణయ్య బీసీ సామాజిక వర్గాల్లో బలమైన నేతగా ఉన్నారు. గత ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి అని ప్రచారం చేసుకున్న బీజేపీ అది ఎన్నికల స్టంట్ అనే ముద్ర బీసీల్లో పడకుండా బీసీ నేతకు రాజ్యసభ ఇచ్చారనే టాక్ సైతం వినిపిస్తోంది. ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు వెళ్తుండటంతో ఈటలకు పార్టీ పదవి ఇవ్వకపోయినా బీసీల్లో అంత వ్యతిరేకత రాదన్న వాదన వినిపిస్తుంది.ఏపీ బీజేపీ కోటాలో రాజ్యసభకు వెళు న్న ఆర్.కృష్ణయ్య తెలంగాణ బీజేపీలో ఏ రూల్ పోషిస్తారనేసందేహాలు అందరిలో ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే ఎస్సీ సామాజికవర్గంలో వర్గీకరణ చేస్తామంటూ మంద కృష్ణ మాదిగను తమ గుప్పెట్లో పెట్టుకున్న బీజేపీ%ొ% తాజాగా బీసీ సామాజికవేత్త ఆర్. కృష్ణయ్య తమవైపు తిప్పుకుంది. ఇదంతా వచ్చే స్థానిక, జమిలి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే అంటున్నారు. ఆ రెండు సామాజిక వర్గాల అండతో రాష్ట్రంలో ఖచ్చితంగా అధికారంలోకి రావొచ్చనే అంచనా తోనే బీజేపీ పాచికలు కదుపుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అంతేకాదు బీసీల్లో ఈటల తప్ప బీజేపీకి దిక్కులేదు అన్న ప్రచారాలకు చెక్ పెట్టినట్లయ్యిందని ఆ పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది.

# వరంగల్ అడవుల్లోకి పెద్దపులి..అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు

వరంగల్, చుట్టూరా పచ్చదనం, ఎత్తైన గుట్టలు, ఎన్నో వృక్షజాతులు, మరెన్నో వన్యప్రాణులు మరోవైపు గోదావరి పరవళ్లు ప్రకృతి రమణీయతతో ఉమ్మడి వరంగల్ అభయారణ్యం అందరినీ ఆకట్టుకుంటుంది. ఏటూరునాగారం, పాకాల అరణ్యం ఒకప్పుడు పెద్ద పులులకు ఆవాసం. ఇప్పుడు మరోసారి దాని అలికిడి కనిపించింది. ఓరుగల్లు అటవీ ప్రాంతంలో ఆహారానికి సరిపడా వన్యప్రాణులు, తాగునీరు, సేద తీరేందుకు అనువైన అటవీ ప్రాంతం పెద్ద పులులను సాదరంగా ఆహ్వానించింది. మహారాష్ట్రల్లోని తాడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వుల్లో పులుల సంఖ్య ఎక్కువైంది. అక్కడ ఆహార కొరత ఉండడంతో గోదావరి, ప్రాణహిత తీర ప్రాంతాలు దాటి మనవైపు వస్తున్నాయని అటవీ అధికారులు తెలిపారు. ఇక్కడి అడవుల్లో శాకాహార జంతువులు అధికంగా ఉండడం, పచ్చదనం ఎక్కువ ఉండడంతో కలిసివస్తోంది. ఛత్తీస్‌గఢ్ కీకారణ్యం నుంచి పెద్దపులి వరంగల్‌లోకి ప్రవేశించింది. ములుగు జిల్లా వెంకటాపురం మండలం చెలిమల, డోలి అభయారణ్యం మీదుగా కొత్తుగుంపు, బోదాపురం అటవీ మార్గంలో గోదావరి తీర ప్రాంతంలోకి చేరుకున్నట్లు అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఇక్కడి పాదముద్రల ఆనవాళ్ల ఆధారంగా ఆ మార్గమే రాకకు సులువైందని నిర్ధారించారు. బోదాపురం సమీప పెద్దలంక భూముల్లో సాగు చేస్తున్న పుచ్చపంటల గుండా దాదాపు ఐదుకు పైగా చిన్నపాటి పాయలు దాటి గోదావరి ప్రవాహం వైపు వెళ్లింది. ఆ నదిని సైతం దాటినట్లు ఆవలి ప్రాంతమైన మంగపేట మండలం చుంచుపల్లి, రాజుపేట ప్రాంతాల్లో



పెద్దపులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో సంచరిస్తుంది మగ పులిగా అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పాదముద్రల ఆనవాళ్లు పరిశీలించిన వారు పులికి 6ఏళ్ల వయస్సు పైబడి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. కొత్త ఆవాసం, ఆహారం, తోడు కోసం పులి ప్రతిరోజు 40 నుంచి 60కి.మీ ప్రయానిస్తుందని తెలిపారు. పెద్దపులి సంచరిస్తున్నందున తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తెలిపారు. వెంకటాపురం అటవీ క్షేత్రం పరిధిలోని యంత్రాంగంతో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఏ మార్గంలో వెళ్లిందో గుర్తించే ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. పులికి ఎలాంటి హాని తలపెట్టకుండా వేటగాళ్లపై నిఘా ఉంచుతామన్న ఆయన కెమెరా ట్రాప్స్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు.

# క్రియాశీలకంగా లేని జన్‌ధన్ ఖాతాల్లో వేల కోట్లు!




న్యూఢిల్లీ: ప్రధానమంత్రి జన్ ధన్ యోజన(పీఎంజేడీవై)కింద దేశవ్యాప్తంగా ఉన్న వివిధ బ్యాంకుల్లో 54.03 కోట్ల ఖాతాలు తెరవగా ఇందులో సుమారు 11.30 కోట్ల ఖాతాలు క్రియాశీలకంగా లేవని కేంద్రం మంగళవారం రాజ్యసభలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. లావాదేవీలు నెరపని ఈ అకౌంట్లలో ఈ ఏడాది నవంబర్ 20వ తేదీ నాటికి రూ.14,750 కోట్ల బ్యాలెన్సు ఉందని వివరించారు. 2017లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 39.62% వరకు ఉన్న జన్ ధన్ ఖాతాల సంఖ్య 2024 నవంబర్‌కు 20.91%కి పడిపోయాయన్నారు.రెండేళ్లపాటు ఎటువంటి లావాదేవీలు జరగని సేవింగ్/ కరెంట్ ఖాతాలను ఆర్‌బీఐ క్రియాశీలకం కాని ఖాతాగా పరిగణిస్తుందన్నారు. ఖాతాలను క్రియాశీలకంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. క్రియాశీలకం కాని ఖాతాల సంఖ్యను తగ్గించుకోవాలని బ్యాంకులను కోరామన్నారు. ఎప్పటికప్పుడు కేవైసీ అప్‌గ్రేడేషన్, వీడియో కస్టమర్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియ వంటి వాటితో అకౌంట్లను క్రియాశీలకం చేయాలని సూచిస్తున్నామన్నారు.

పీఎం-కిసాన్‌తో 2 కోట్ల ఎస్సీ, ఎస్టీ రైతులకు లబ్ధి

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం-కిసాన్) ద్వారా దేశవ్యాప్తంగా 2.04 కోట్ల మందికి పైగా ఎస్సీ, ఎస్టీ రైతులకు లబ్ధి చేకూరుతోందని కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన పీఎం-కిసాన్ కింద ఇప్పటి వరకు 18 విడతలుగా రూ.3.46 లక్షల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇటీవలి 18వ ఇన్‌స్టాల్‌మెంట్‌లో 9.58 కోట్ల మంది లబ్ధిదారులు కాగా, వీరిలో 1.16 కోట్ల మంది ఎస్‌సీ రైతులు, 88.34 లక్షల మంది ఎస్‌టీ రైతులు, ఇతర కేటగిరీలో 7.54 కోట్ల మంది రైతులు ఉన్నారని వివరించారు. పథకం కింద ఏటా రూ.6 వేలను మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో కేంద్రం జమ చేస్తోందంటూ ఆయన ఈ మొత్తాన్ని పెంచే యోచన లేదని వివరించారు.

'పీఎం విశ్వ కర్మ' కింద రూ.1,751 కోట్ల రుణాలు

పీఎం విశ్వకర్మ పథకం కింద అక్టోబర్ 31వ తేదీ నాటికి రూ.1,751 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి రాజ్యసభకు తెలిపారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పి వృత్తులకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని నిపుణులు, పనివారికి సులభంగా రుణాలు అందేలా పలు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పథకం కింద ఈ వర్గం వారు మొత్తం 2.02 లక్షల బ్యాంకు అకౌంట్లు తెరిచారని చెప్పారు. 2023%-%24 నుంచి 2027-28 కాలానికి గాను కేంద్రం వీరికి ఈ పథకం కింద చేయూతనిచ్చేందుకు రూ.13 వేల కోట్లు కేటాయించింది.

18.74 కోట్ల రైతులకు పంట రుణాలు

ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా సుమారు 18.74 కోట్ల మంది రైతులు వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకున్నారని కేంద్రం తెలిపింది. ఇందులో మొదటిస్థానంలో తమిళనాడు నిలిచిందని వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రాంనాథ్ ఠాకూర్ మంగళవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. మొత్తం 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రైతులకు వ్యవసాయ రుణాలతో బ్యాంకు ఖాతాలున్నాయని వివరించారు. తమిళనాడులో అత్యధికంగా 2.88 కోట్ల మంది రైతులు పొందగా, తర్వాతి స్థానంలో యూపీలోని 1.88 కోట్ల మంది, కర్ణాటకలో 1.62 కోట్ల మంది రుణాలు పొందారని తెలిపారు. 2019%-%2024 మధ్య కాలంలో కేంద్రం ఎటువంటి పంట రుణాలను మాఫీ చేయలేదని చెప్పారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం రైతుల రుణాలను రద్దు చేశాయని మంత్రి పేర్కొన్నారు.

# ఇది కదా మెగా పొలిటికల్ రికార్డు !



హైదరాబాద్,మెగా అంటేనే ఒక బిగ్ సౌండ్ వినిపిస్తుంది. మెగా స్టార్ గా దశాబ్దాలుగా సినీ సీమను ఏలుతున్న చిరంజీవి తనతో పాటు ఇతరులనూ ముందుకు తెచ్చారు. అలా మెగా కాంపౌండ్ గా మారి అతి పెద్ద వట వృక్షంగా టాలీవుడ్ సీమలో వేళ్ళూనుకుంది. చిరంజీవికి జనాలలో ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. మరి కొన్నేళ్ళలో ఆయన సినీ అర్ధ శతాబ్ది ఉత్సవాలకూ రంగం సిద్ధం అవుతోంది.ఇక చిరంజీవి అంటే కేవలం సినిమాలకే కాదు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు. ఆయన ప్రజారాజ్యం పార్టీ 18 సీట్లూ 70 లక్షలకు పైగా ఓట్లు సాదించారు. కాంగ్రెస్ లో పార్టీని విలీనం చేయడం ద్వారా రాజ్యసభ సభ్యుడిగా ఆరేళ్ల పాటు చేశారు. మధ్యలో రెండేళ్ళ పాటు కేంద్ర మంత్రిగానూ ఇండిపెండెంట్ చార్జితో పనిచేశారు.అలా చిరంజీవి రాజకీయ రంగ ప్రవేశం ద్వారా తగిన గుర్తింపునే దక్కించుకున్నారు అని చెప్పాలి. ఇక ఆయన సోదరుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ పెట్టి 2024లో భారీ విజయం అందుకున్నారు. టీడీపీ బీజేపీలతో కలసి కూటమి కట్టించడంతో సక్సెస్ అయిన పవన్ కి తన కృషికి తగినట్లుగా ఉప ముఖ్యమంత్రి హోదాతో పలు కీలక శాఖలు లభించాయి.ఇపుడు అదే కుటుంబం నుంచి ముచ్చటగా మూడవ వారుగా మెగా బ్రదర్ నాగబాబు రాష్ట్ర మంత్రి కాబోతున్నారు. ఆయన అతి తొందరలో మంచి ముహూర్తం చూసుకుని మంత్రిగా ప్రమాణం చేస్తారు అని అంటున్నారు. అదే కనుక జరిగితే మాత్రం మెగా ఫ్యామిలీలో ముగ్గురు అన్నదమ్ములూ మంత్రి పదవులు అందుకున్న వారే అవుతారు.ఆ విధంగా ఎవరికీ దక్కని ఒక రేర్ రికార్డుని మెగా బ్రదర్స్ క్రియేట్ చేసిన వారు అవుతారు అని అంటున్నారు. తమిళనాడులో కరుణానిధి కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మంత్రులుగా చేశారు. కర్ణాటకలో దేవెగౌడ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మంత్రులుగా చేశారు. బీహార్ లో ఆర్జేడీ లో ఇద్దరు అన్నదమ్ములు మంత్రులు అయ్యారు.కానీ ఒకే ఫ్యామిలీలో ముగ్గురు అన్నదమ్ములు మంత్రులుగా చేయడం అంటే అది ఇప్పట్లో ఎవరూ బద్ధలు కొట్టలేని రికార్డు అనే అంటున్నారు. సినీ రంగంలో మెగా ఫ్యామిలీ సాధించిన రికార్డులు అపూర్వం అనే చెప్పాలి. వాటిని బీట్ చేయడం కష్టమే అవుతోంది.ఇపుడు రాజకీయాల్లోనూ ఈ కుటుంబం నెలకొల్పుతున్న రికార్డులు చూస్తే అందరిలోనూ ఆసక్తి కలుగుతోంది ఒకనాడు రాజకీయాల్లో మెగా ఫ్యామిలీ రాణించలేదు అన్న వారే ఇపుడు వారికి దక్కుతున్న రాజకీయ సిరిని చూసి ముక్కున వేలేసుకునే పరిస్థితి ఉంది.అయితే ఇదంతా వారి పట్టుదల కృషి, సమయస్ఫూర్తితో పాటు సరైన వ్యూహాల వల్లనే సాధ్యపడింది అని అంటున్నారు. ఏది ఏమైనా ఒకే కుటుంబం అటు సినీ రంగంలో ఇటు రాజకీయ రంగంలో ఒకే సమయంలో రాణిస్తూ అరుదైన రికార్డులను స్థాపించడం అంటే ఆ ఘనత ఒక్క మెగా ఫ్యామిలీకే దక్కుతుందేమో.ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం మెగాస్టార్ చిరంజీవి హీరోగా వారి సొంత బేనర్ మీద ముగ్గురు మొనగాళ్ళ అని మూవీ వచ్చింది. ఇపుడు ఈ మెగా బ్రదర్స్ కి ఆ టైటిల్ యాప్ట్ అవుతుందని అభిమానులు అంటున్నారు. ముగ్గురు మినిస్టర్లు అని కూడా ఇక ముందు దానిని మార్చి అనుకోవాలేమో అని కూడా అంటున్నారు.


## ఢిల్లీల్లో దారుణంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ,ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. ఢిల్లీలో ఈ సీజన్‌లో అత్యంత శీతల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవాళ ఉదయం రాజధానిలో ఉష్ణోగ్రతలు 4.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. నిరాశ్రయులు నైట్ షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్నారు.చలికి తోడు ఢిల్లీలో వాయు కాలుష్యం అధ్వాన స్థితిలోనే కొనసాగుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. ఇవాళ ఉదయం 7 గంటల ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 209గా నమోదైంది. ఆనంద్ విహార్ ప్రాంతంలో ఏక్యూఐ 218గా, అశోక్ విహార్‌లో 227, ద్వారకాలో 250, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో ఏక్యూఐ లెవల్స్ 218గా నమోదయ్యాయి. ఇక ఆయా నగర్‌లో 148, బురారీ క్రాసింగ్ వద్ద 187, ఛాందినీ చౌక్ ప్రాంతంలో 181, డీటీయూలో 165గా ఏక్యూఐ నమోదైనట్లు సీపీసీబీ తెలిపింది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని,

# అవకాశం ఇస్తే ఇలా చేస్తారా..?

విజయవాడ,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ఆర్థిక స్కాంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. 2019-24 మధ్య ఏపీని అన్ని విధాలా నాశనం చేశారని మండిపడ్డారు. వైఎస్ బిడ్డగా అవకాశం ఇస్తే అడ్డగోలుగా దోచేశారని ఆరోపించారు. ఈసారి రెండు స్థానాలు కూడా జగన్‌కు వచ్చే అవకాశం లేదన్నారు.

జగన్ చేసిన అన్ని స్కాంల పైన ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను పెట్టాలని సీఎంను కోరుతున్నామన్నారు.వైసీపీ నాయకులు చాలా మంది దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. కాకినాడ పోర్ట్‌ను కేవీ రావును బెదిరించి లాక్కున్నారన్నారు. వాటిపై విచారణ చేసి కేవీ రావుకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. జగన్ - అదానీ మధ్య జరిగిన ఒప్పంద ంలో రూ.1750 కోట్లు అవినీతి జరిగిందన్నారు. జగన్ డబ్బులు తీసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయన్నారు. ఈ స్కాంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దోపిడీలు చేసి ఎవరికి వారు ఆర్థికంగా దోచుకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సొమ్ములను కొట్టేసిన వారిని శిక్షించాలన్నారు. జగన్ ధన దాహానికి ఇప్పుడు ప్రజలపై విద్యుత్ భారం పడిందన్నారు. రూ.650 కోట్లకు గంగవరం ప్రాజెక్టును ఎలా అప్పగించారని ప్రశ్నించారు. "అదానీ ఏమైనా నీ తల మీద తుపాకీ పెట్టి ఇవ్వమన్నారా" అని జగన్‌ను ప్రశ్నించారు. జగన్ హయాంలో అత్యంత దారుణ ంగా, నిస్సిగ్గుగా



దోపిడీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్కో విషయం తెలుస్తుంటే మతిపోతోందన్నారుర. విశాఖలో అడ్డగోలుగా భూములను భయపెట్టి దోచుకున్నారని విమర్శించారు. ప్రైవేటు ఆస్తులను కూడా బలవంతంగా లాక్కున్నారన్నారు. జగన్ తన ఇంటిని మొత్తం పూర్తిగా మూసి వేశారని.. ఒకసారి వాస్తును కూడా పరిశీలించాలని హితవు పలికారు. "వచ్చే ఎన్నికలలో ఎలాగూ వైసీపీ ఓటమి ఖాయమని.. కనీసం మీరైనా అసెంబ్లీకి వచ్చేలా పని చేసుకోండి" అంటూ బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com